
ప్రకృతి విపత్తులు తప్పవు కానీ ముందస్తు జాగ్రత్తలతో నష్టాన్ని తగ్గించవచ్చని సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిరూపించింది. మొంథా తుఫాన్‌పై ముందస్తు చర్యలు, సమన్వయంతో రాష్ట్రం పెద్ద నష్టాల నుంచి రక్షించబడింది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 30.10.2025


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 193 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# తుఫాన్ మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు పరిహారం




## మొంథా తుఫాన్ పంట నష్టం వివరాలు 5 రోజుల్లో ఇవ్వండి

## 24 గంటల్లోగా పునరావాస శిబిరాల్లో కుటుంబాలకు రేషన్

## విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణే లక్ష్యం

## మెరుగైన పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

## తాగునీరు కలుషితం కాకుండా చూడండి... నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

## తుఫాన్ అనంతర పరిస్థితులపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఐదు రోజుల్లోగా పంట నష్టానికి సంబంధించిన పూర్తి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పంట నష్టం వివరాలను త్వరగా సేకరించేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, వాటిని కాపాడేందుకు గల అవకాశాలపై రైతులకు తగు సూచనలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. బుధవారం ఉదయం మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి, పర్యటన అనంతరం సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో... తుఫాన్ వల్ల సంభవించిన నష్టంపైనా, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు సేకరించిన సమాచారం వరకు పరిశీలిస్తే... రాష్ట్రంలోని 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో 87 వేల హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని, ఇందులో 59 వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో వరి పంటతో పాటు, ప్రత్తి, మొక్కజొన్న, మినుము వంటి పంటలు నీట మునిగినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 78,796 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. అలాగే 42 పశువులు చనిపోయినట్టు చెప్పారు. అయితే ఇది ప్రాథమికంగా ఉన్న అంచనాలు మాత్రమేనని.. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను చూస్తుంటే... తుఫాన్ ప్రభావం వల్ల జరిగిన నష్టం ఇంకా పెరిగేలా ఉందని అధికారులు వెల్లడించారు.

**యథావిధిగా ఆర్టీసీ సర్వీసులు :** సహాయక చర్యలు ఏ విధంగా కొనసాగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ తక్షణం జరగాలని స్పష్టం చేశారు. బుధవారం రాత్రి కల్లా విద్యుత్ సరఫరా చేయాలని, గురువారం నాటికి రహదారుల గుంతలు మరమ్మతు పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసులు యథావిధి కొనసాగించాలని సూచించారు. ఈ విషయాల్లో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరమ్మతులకు గురైన ఫీడర్లను పునరుద్ధరిస్తున్నామని, కూలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు వివరణ ఇచ్చారు. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను పటిష్ట పరచాలన్నారు. పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని చెప్పారు. జలాశయాల సమర్థ నీటి నిర్వహణకు జిల్లా కలెక్టర్లు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు గురువారం నాటికి బియ్యం, నిత్యావసరాల పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా తాగు నీటి సరఫరాకు ఇబ్బంది రాకూడదని, తాగునీరు కలుషితం అయితే సహించేది లేదని, డయేరియా కేసులు నమోదు కాకుండా రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు బాధ్యత వహించాలన్నారు.

**ప్రకాశం జిల్లాలో మెరుగైన చర్యలు చేపట్టాలి :** ఒంగోలు పట్టణంలో పలు కాలనీలు నీట మునగడంపై ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబుపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ ఇటువంటి పరిస్థితి తలెత్తలేదని, భవిష్యత్‌లో పాలనా వైఫల్యం కనిపించకూడదని ముఖ్యమంత్రి చెప్పారు. తుఫాన్ రక్షణ చర్యలపై పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ప్రతీ జిల్లాలోనూ తుఫాన్ల సమయంలో తలెత్తే పరిస్థితులను అధిగమించేలా ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రోడ్లు, పునరావాస కేంద్రాలు, విద్యుత్-తాగునీటి సరఫరా వంటి విషయాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ప్రజాభిప్రాయం సేకరించి, లోపాలను సరిచేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు ముగ్గురు మృతి చెందారని అధికారులు వెల్లడించగా, మృతుల కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తుఫాన్ తీరం దాటడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తుఫాన్ తీవ్ర స్థాయిలో లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారని, ప్రభుత్వం తీసుకున్న రక్షణ చర్యలపై ప్రజల నుంచి సానుకూల స్పందన, సంతృప్తి వ్యక్తమవుతోందని వెల్లడించారు.

**మొత్తం 1.16 లక్షల మందికి పునరావాసం :** రాష్ట్రంలో 1,209 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో 1.16 లక్షల మందికి

మిగతా 2లో...

## తుఫాను విపత్తు నుంచి రాష్ట్రాన్ని కాపాడిన సీఎం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రణాళిక బద్ధంగా ముందస్తు చర్యలు తీసుకుని మొంథా విపత్తు నుంచి రాష్టాన్ని సీఎం చంద్రబాబు కాపాడారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సుదీర్ఘ పరిపాలనా దక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ పెద్దగా తీసుకున్న చర్యల కారణంగానే ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని పేర్కొన్నారు. వాతావరణ శాఖ నుంచి తుపాన్ తీవ్రతపై హెచ్చరికలు వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు సచివాలయంలోని "రియల్ టైం గవర్నెన్ సిస్టమ్" (కేంద్రం)లోనే ఉంటూ రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ సచివాలయాల వరకు తీసుకోవాల్సిన చర్యలపై ఇచ్చిన సూచనలు, ఆదేశాలు సత్ఫలితాలిచ్చాయన్నారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ కొత్తగా జారీచేసిన ఎస్ఓపీ (ప్రామాణిక విధివిధానాలు) వల్ల వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తించారని,

మిగతా 2లో...

## తుపాను ప్రభావంపై మంత్రి లోకేశ్ నిరంతర సమీక్ష



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులపై మంత్రి నారా లోకేశ్ నిరంతర సమీక్ష నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను మంత్రులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకుంటున్నారు. విద్యుత్ సమస్యపై మంత్రి గొట్టిపాటితో మాట్లాడారు. సాయంత్రం 4 గంటల కల్లా 100 శాతం విద్యుత్ పునరుద్ధరించే దిశగా సిబ్బంది పని చేస్తున్నారని గొట్టిపాటి వివరించారు. కొన్నిచోట్ల ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ నిలిపివేసినట్లు వెల్లడించారు. సీఎండీలు కూడా క్షేత్రస్థాయిలో ఇదే పనిలో నిమగ్నమైనట్లు మంత్రి వివరించారు.

ప్రధానంగా కోనసీమ, కృష్ణా, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిందని మంత్రి లోకేశ్‌కు గొట్టిపాటి తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని లోకేశ్ సూచించారు. వివిధ జిల్లాల్లో మొంథా తుఫాను తీవ్రత, ఇప్పటివరకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. మొంథా తుఫాను వల్ల కలిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలు త్వరితగతిన రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు.

విద్యుత్ పునరుద్దరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు: ఈదురు గాలులకు విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్దరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని వెల్లడించారు. వీలైనంత తొందరగా విద్యుత్ సరఫరాను పూర్తిగా పునరుద్దరిస్తామని తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం నివారించేందుకే విద్యుత్ సరఫరాను ముందస్తుగా నిలిపి వేశామని తెలిపారు. ఫలితంగా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని వ్యాఖ్యానించారు. బలమైన ఈదురు గాలులకు పెద్ద ఎత్తున విద్యుత్ స్థంభాలు పడిపోయాయని అన్నారు. 20 వేల ఇళ్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాల్సి ఉందని తెలిపారు.

మిగతా 2లో...

## తుఫాను ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి

- పకడ్బందీగా పారిశుద్ధ్య పనుల కోసం మొబైల్ బృందాలు
- రోడ్ల పునరుద్ధరణకు తక్షణ చర్యలు
- తాగు నీరు సరఫరాకు ఇబ్బంది ఏర్పడిన చోట్ల ప్రత్యామ్నాయ చర్యలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 'మొంథా తుపానును సమర్థంగా ఎదుర్కొన్నాం. ఇప్పుడు తుపాను అనంతర చర్యలు అత్యంత కీలకమైనవి. ఈ సమయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖలు యుద్ధ ప్రాతిపదికన పని చేయాలి. పటిష్టమైన ప్రణాళికతో, సమన్వయంతో పనిచేయాలి. తుపాను, భారీ వర్షాలు తగ్గాక గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. ఎక్కడా ఇబ్బందులు లేకుండా దీనిని సమర్థవంతంగా పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉంద'ని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉన్న గ్రామాల్లో సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్ కార్యక్రమాలను మొదలుపెట్టాలన్నారు. తుపాను ప్రభావం వల్ల పాడైన రోడ్లను ప్రాధాన్య ప్రకారం బాగు చేయాలన్నారు. మొంథా తుపాను అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

2లో...

## విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సమస్యపై ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. మూడు డిస్కమ్‌ల సిఎమ్‌డిలతో కలిసి బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులంతా పునరుద్ధరణ చర్యల్లో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను అరికట్టేలా చూడాలని కోరారు. తుపాన్ ధాటికి గాలులు వేగంగా వీయడంతో కొన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు మంత్రికి అధికారులు వివరించారు. పోల్ టూ పోల్ పెట్రోలింగ్ చేస్తూ సమస్య లేని చోట పునరుద్ధరణ చేయాలని మంత్రి ఆదేశించారు. ఎస్‌పిడిసిఎల్ నుంచి తీసుకొచ్చిన అదనపు సిబ్బందితో క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వర్షం పడుతున్న కారణంగా పునరుద్ధరణకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో మూడు డిస్కంల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, శివశంకర్, పి పుల్లారెడ్డి పాల్గొన్నారు. కాగా విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్.. మంత్రి గొట్టిపాటికి ఫోన్ చేసి విద్యుత్ పునరుద్ధరణ చర్యలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## తుఫాను బాధితులకు ఆర్థిక సాయం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ కారణంగా ఇళ్లు విడిచి పునరావాస కేంద్రాలకు చేరిన కుటుంబాలకు రూ. 3 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొంథా సైక్లోన్ స్పెషల్ స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్‌గా ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. ఈ మేరకు స్పెషల్ సీఎస్ సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, తాజాగా.. సిఎం చంద్రబాబు మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనకు బయలుదేరారు. హెలికాప్టర్ ద్వారా ఏరియల్ విజిట్ చేయనున్నారు. బాపట్ల, పల్నాడు, కృష్ణా, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు. చిలకలూరిపేట, పర్చూరు, చీరాల, కోడూరు, నాగాయలంక మీదుగా ఓడలరేవు వరకు ఏరియల్ విజిట్ కొనసాగనుంది.

మిగతా 2లో...

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలకు అనుమతి

- ఏపీ రైతులకు 50శాతం రాయితీ
- రూ.25 కోట్లు విడుదల
- ఆర్థిక శాఖకు పరిపాలన అనుమతులు మంజూరు
- రెండు జీవోలు విడుదల

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.410.75 కోట్లు విడుదల చేసేందుకు ఆర్థికశాఖకు పరిపాలన అనుమతులిచ్చింది.

ఈ మేరకు రెండు జీవోలు వేర్వేరుగా విడుదల చేశారు. 2025-26 సంవత్సరానికి టైడ్ గ్రాంట్ కింద తొలి విడతగాఒక జీవోలో రూ.365.69 కోట్లు.. మరో జీవోలో రూ.45.06 కోట్లు విడుదలకు అనుమతులు ఇచ్చారు. 13 జిల్లా పరిషత్‌లు, 650 మండల పరిషత్‌లు, 13,092 పంచాయతీలకు లబ్ధి చేకూరనుంది. స్థానిక సంస్థలకు కష్టాలు తీరనున్నాయి.

## గండ్లకు వెంటనే మరమ్మతులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** భారీ వర్షాల వల్ల చెరువులకు గండ్లు పడినచోట వెంటనే మరమ్మతులు చేయాలని, దీనికోసం కలెక్టర్ల అనుమతులతో నిధులు వెచ్చించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. వరదల నేపథ్యంలో బుధవారం జలవనరులశాఖ అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వెలిగొండ టన్నెల్‌లో తొమ్మిది కిలోమీటర్ల దూరం నీరు రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. టన్నెల్ ఫీడర్ కెనాల్‌కు గండిపడి ఎగ్జిట్ ప్రాంతంలోకి నీరు వచ్చిందని, సిబ్బంది 250 మందిని తరలించామని తెలిపారు. అక్కడ డీవాటరింగ్ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. గుండ్లకమ్మ పరీవాహక ప్రాంతం అధికవర్షాలతో అవుట్‌ఫ్లో 70 వేల క్యూసెక్కుల నుండి లక్ష క్యూసెక్కులకు విడుదల చేస్తున్నామని తెలిపారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో దిగువ గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఒడిషా రాష్ట్రంలో వరదలను దృష్టిలో పెట్టుకుని బహుదా పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల, కాలువగట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. విజయవాడ సమీపంలో బుడమేరు డైవర్షన్ ఛానల్‌పై నిరంతరం నిఘా ఉండాలన్నారు.

## ప్రతి రైతునూ ఆదుకుంటాం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తుపాన్ సహాయక చర్యలపై ఏలూరు కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత సంవత్సరంలో 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని,

## అమరావతి రైతులకు ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లపై అసత్య ప్రచారం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని రైతులకు ప్లాట్ ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల పై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు... రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు...రాబోయే నాలుగు నెలల్లో రైతులకు కేటాయించాల్సిన ప్లాట్ లతో పాటు రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేసారు మంత్రి..సచివాలయంలో మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు...అమరావతి విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని అన్నారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, 2014-19 మధ్య కాలంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి

# తుఫాన్ మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు పరిహారం




(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుఫాను సమయంలో ఆశ్రయం లభించింది. మొత్తం 249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం చూపింది. రాష్ట్రంలో 380 కి.మీ. పొడవున పంచాయతీరాజ్ రహదారులు, 14 బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతినగా రూ. 4.86 కోట్ల నష్టం వాటిల్లింది. 2,294 కి.మీ. పొడవున ఆర్ అండ్ బీ రహదారులు దెబ్బతిని రూ. 1,424 కోట్ల నష్టం సంభవించింది. రూరల్ వాటర్ సప్లయ్‌కు సంబంధించి రూ. 36 కోట్లు, ఇరిగేషన్ పనుల్లో రూ. 16.45 కోట్ల వరకు నష్టం జరిగింది. సురక్షిత ప్రాంతాలకు 3,175 మంది గర్భిణీలను తరలించారు. 2,130 మెడికల్ క్యాంపుల నిర్వహించారు. 297 రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండగా, వాటిని దారి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 380 చెట్లు రహదారులపై విరిగిపడగా, అన్నింటినీ తొలిగించారు. మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్ సహా ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# తుపాను ప్రభావంపై మంత్రి లోకేశ్ నిరంతర సమీక్ష



(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు పడుతుండటం వల్ల పునరుద్దరణకు కొంత ఆలస్యమైందని ఈ రోజు మధ్యాహ్నం కల్లా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను పూర్తిగా పునరుద్దరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

సురక్షితంగా బయటకు తెచ్చే చర్యలు: అద్దంకి గుండ్లకమ్మ మంచినీటి పథకం వద్ద చిక్కుకున్న వారి గురించి అధికారులతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. బాధితుల్ని క్షేమంగా సురక్షిత ప్రాంతానికి తీసుకురావాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఒకరిని కాపాడినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన వారిని సురక్షితంగా బయటకు తెచ్చే చర్యలు చేపట్టినట్ల మంత్రికి అధికారులు తెలిపారు.

# తుఫాను బాధితులకు ఆర్థిక సాయం

(మొదటి పేజీ తరువాయి)

మరికాసేపట్లో కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో ల్యాండ్ అవుతారు. అనంతరం ఓడలరేవు నుంచి రోడ్డు మార్గాన ప్రయాణించి, వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలిస్తారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. తుఫాన్ కారణంగా ఎడితెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం ధాటికి వాగులు, కాలువులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. వర్షాలతో పాటు బలమైన గాలులు వీయడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని జిల్లాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తుఫాన్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. ముందస్తు చర్యల్లో భాగంగా.. తుఫాన్ ముప్పు ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారికి ప్రభుత్వం రూ. 3 వేలు ఆర్థిక సాయం ప్రకటించింది.

# ప్రతి రైతునూ ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలుపై రైస్‌మిల్లర్లతో చర్చించామని, పంట నష్టాలపై 30వ తేదీలోగా నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాలలో తుపాన్ తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గన్నారు.

# అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** అన్నక్యాంటీన్ల పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మిర్చియార్డ్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన అన్న క్యాంటీన్ల పరిసరాల పరిశుభ్రత పట్ల సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా లైట్లు, షింక్ లో నీరు వచ్చేలా ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఆహార సరఫరా అనంతరం ప్రాంగణం శుభ్రం చేయాలని అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు.

# తుఫాను ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన చర్యలను తక్షణమే మొదలుపెట్టాలని సూచించారు.

1583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రివర్యులకు తెలియచేశారు. శానిటేషన్ సిబ్బందిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకున్నామని చెప్పారు. 38 చోట్ల రోడ్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయనీ, మరో 125 చోట్ల రహదారులకు గుంతలు ఏర్పడ్డాయని వివరించారు. రక్షిత తాగు నీటి పథకాల ట్యాంకులు దగ్గర క్లోరినేషన్ ప్రక్రియ చేస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "తాగు నీటిని అందించే పథకాలకు, నీటి సరఫరాకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయం చూడాలి. ఈ చర్యలు తక్షణమే తీసుకోవాలి. గ్రామాల్లో మొబైల్ శానిటేషన్ బృందాలను సిద్ధంగా ఉంచాలి. 21,055 మంది పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి పారిశుద్ధ్య మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టండి. వాన నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో నీటిని బయటకు పంపించే చర్యలు తీసుకోవాలి. నీరు ఎక్కడ కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ తరుణంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు పెరుగుతాయి. వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో వ్యాధులు రాకుండా అరికట్టాల్సిన బాధ్యత తీసుకోండి. మూడు, నాలుగు రోజుల పాటు పారిశుద్ధ్య నిర్వహణపై పూర్తిగా దీనిపై దృష్టి సారించండి. మళ్ళీ సాధారణ పరిస్థితి వచ్చే వరకు గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి. దీనిలో ఎక్కడ లోటుపాట్లకు తావు ఉండకూడదు. దెబ్బ తిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలి" అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్



కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి:** తుపాను అనంతరం తన శాఖల వారీగా జరిగిన నష్టం, తీసుకోవాల్సిన చర్యలను ఉన్నతాధికారులు పవన్ కళ్యాణ్‌కి వివరించగా దీనిపై తగిన సూచనలను ఉప ముఖ్యమంత్రి చేశారు.

**పంచాయతీరాజ్ శాఖ :** రాష్ట్రంలోని జిల్లా పరిషత్ సీఈవోలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీపీవోలు, డీఎల్ డీఓలు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ సెక్రటరీలతోపాటు క్షేత్రస్థాయి సిబ్బంది కూడా అందుబాటులో ఉండి పరిస్థితిని చక్కదిద్దాలి.

సమాచార లోపం లేకుండా సమన్వయంతో పనిచేయాలి. అవసరమైతే టెలీ కాన్ఫరెన్స్ ద్వారా నిత్యం ఒకరికి ఒకరు మాట్లాడుకొని సమయానుకూలంగా పనులు పూర్తి చేయాలి. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకొని అధికారులు పనులు సమన్వయం చేసుకోవాలి.

రాష్ట్రవ్యాప్తంగా 1158 మొబైల్ శానిటేషన్ బృందాలు ఏర్పాటు చేసుకొని పారిశుధ్య పనులు మొదలుపెట్టాలి.

తుపాను ప్రభావం వల్ల రాష్ట్రంలో 1583 గ్రామాల్లో దుర్భర పరిస్థితులు ఉన్నట్లు గుర్తించాం. పారిశుద్ధ్యం, ఇతర పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎమర్జెన్సీ బృందాలు సిద్ధంగా ఉన్నాయి.

పంచాయతీల వద్ద అవసరమైనంత బ్లీచింగ్ నిల్వలు ఉన్నాయి. డ్రైనేజీల్లో అడ్డంకులు ఏర్పడితే క్షేత్ర స్థాయి సిబ్బంది తక్షణమే స్పందించాలి.

**గ్రామీణ నీటి సరఫరా శాఖ :** తుపాను ప్రభావంతో రాష్ట్రంలో మొత్తం మీద గ్రామీణ నీటి సరఫరా శాఖకు చెందిన వివిధ మంచి నీటి పథకాలకు రూ. 1.04 కోట్ల నష్టం ఏర్పడింది. వీటిని వెంటనే పునరుద్ధరణకు చర్యలు చేపట్టండి.

**పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ :** మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 779 రోడ్లు, 89 బ్రిడ్జ్ లు, 473 కల్వర్టులు దెబ్బ తిన్నాయి. వీటికి వెంటనే మరమ్మతులు మొదలుపెట్టండి.

రాష్ట్రవ్యాప్తంగా తుపాను ప్రభావంతో బ్లాక్ చేసిన రోడ్లను వెంటనే పునరుద్ధరణకు చర్యలు తక్షణమే చేపట్టండి.

పాక్షికంగా ధ్వంసమైన రోడ్లు, వంతెనలను జిల్లా స్థాయి నిధులతో వెంటనే బాగు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయండి. అలాగే ఎస్.డి.ఆర్.ఎఫ్. ఫండ్స్ ద్వారా మిగిలిన వాటిని కూడా పునర్నిర్మించే ఏర్పాట్లు చేయాలి.

# తుఫాను విపత్తు నుంచి రాష్ట్రాన్ని కాపాడిన సీఎం

(మొదటి పేజీ తరువాయి)

99.1% వరకు విధుల్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్లో మంత్రి సత్యకుమార్ బుధవారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు.

**కేంద్రం నుంచి ప్రధాని మోడీ పూర్తి భరోసా :** జిల్లాలకు ప్రత్యేకంగా నియమించిన సీనియర్ ఐ.ఎ.ఎస్ లు, కలెక్టర్ల నుంచి సేకరించిన వివరాలను తుపాన్ తీవ్రతకు అనుగుణంగా విశ్లేషిస్తూ సీఎం తీసుకున్న చర్యలవల్ల సత్ఫలితాలు కనిపించాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు. జిల్లాలో మండలాల వారీగా వర్షపాతం నమోదుకు అనుగుణంగా కూడా సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యలు పరిపాలనారంగంలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని చాటి చెప్పాయన్నారు. రాష్ట్ర సంరక్షకుడిగా ఉన్న చంద్రబాబుతో ప్రధాని మోదీ స్వయంగా మాట్లాడడమే కాకుండా వివరాల సేకరణ కోసం పీఎం కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటరును ఏర్పాటుచేశారని తెలిపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా కూడా తనతో మాట్లాడారని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని



అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం భరోసా ఇచ్చిందని తెలిపారు.

**అప్రమత్తంగా వ్యవహరించిన వైద్య ఆరోగ్య శాఖ :** ప్రసవానికి దగ్గర్లో ఉన్న సుమారు 2,500 మంది గర్భిణులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. యాంటీ స్నేక్ వీనం, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్, ఇతర అత్యవసర మందులను జిల్లాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మత్స్యకారులు ఉండే ప్రాంతాల్లో బోటు క్లినిక్ లను సైతం ఏర్పాటుచేశామని తెలిపారు. అత్యవసర (108), 104 (సంచార వైద్యం) కొన్ని అంబులెన్సులను సహాయక చర్యల నిమిత్తం ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లు తెలిపారు. 588 అత్యవసర కాల్స్ కు తగ్గట్లు చర్యలు తీసుకున్నామన్నారు. వాతావరణ కేంద్రం హెచ్చరికల జారీ నుంచి వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాలో అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టిందని, కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా వ్యవహరించారన్నారు. తొలుత మొంథా ప్రభావంపై కాస్త ఆందోళన కలిగినప్పటికీ, సిఎం చంద్రబాబు నిరంతర సమీక్షల వల్ల విపత్తునుండి బయటపడ్డామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.

**జాగ్రత్తలు పాటించాలి:** "ఇకపై తుపాను ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. కాచి వడబోసిన నీటినే తాగాలి. మరో 4 రోజులపాటు ప్రజలు కాస్త జాగ్రత్తగా ఉండాలి" అని మంత్రి చెప్పారు.

# అమరావతి రైతులకు ప్లాట్ల కేటాయింపు,రిజిస్ట్రేషన్లపై అసత్య ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన తర్వాత ప్లాట్ ల కేటాయింపు,రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురించి లెక్కలతో సహా మీడియా ముందు వివరించారు మంత్రి నారాయణ.

అమరావతి కోసం భూసమీకరణ కింద మొత్తం 30,635 మంది రైతుల నుంచి 34,911.23 ఎకరాలను సీఆర్డీఏ ద్వారా తీసుకోవాలని నిర్ణయించామన్నారు..వీటిలో ఇప్పటివరకూ 29,644 మంది రైతులకు సంబంధించిన 34,192.19 ఎకరాలకు ప్లాట్ ల కేటాయింపు పూర్తయిందన్నారు...గత టీడీపీ ప్రభుత్వంలోనే 26,197 మంది రైతులకు సంబంధించిన 31,003.38 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తి కాగా...కూటమి ప్రభుత్వం వచ్చిన ఇప్పటివరకూ 2727 మంది రైతులకు సంబంధించిన 3188.81 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తయిందన్నారు...ఇంకా 991 మంది రైతులకు సంబంధించిన 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు..వీటిలో ఉండవల్లిలో లేఅవుట్ ఫైనల్ కాకపోవడం,లంక భూములు,కోర్టు కేసులు,పీఓటీ కేసులు,12 సెంట్ల లోపు ఉన్న భూములు ఉన్నాయన్నారు.

ఇక రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా వేగంగా జరుగుతుందని మంత్రి తెలిపారు...మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా....ఇప్పటివరకూ 26,732 మంది రైతులకు 60,980 ప్లాట్ లు రిజిస్ట్రేషన్ పూర్తయిందని మంత్రి నారాయణ



తెలిపారు..ఇంకా 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు...వీటిలో కోర్టు కేసులున్నవి 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు,ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందిన 1170 ప్లాట్లు,వివాదాల్లో 450 మందికి చెందిన 1889 ప్లాట్లు,పీఓటీ కుసుల్లో 78 మంది రైతులకు చెందిన 208 మంది ప్లాట్లు,దేవదాయ శాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందిన 69 ప్లాట్లు,లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందిన 337 ప్లాట్లు,ఎన్ ఆర్ ఐలు 210 మందికి చెందిన 444 ప్లాట్లు ఉన్నాయి...ఆయా పెండింగ్ ప్లాట్ల కు సంబంధించిన రిజిస్ట్రేషన్ ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు...ప్రస్తుతం రోజుకు 60 నుంచి 90 ప్లాట్ల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు.

అలాగే రైతులకు చెల్లించే కౌలు నగదుపైనా మంత్రి స్పష్టత ఇచ్చారు...ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 231.03 కోట్ల నగదు చెల్లించగా మరో 484 మంది రైతులకు 3.15 కోట్లు వివిధ సాంకేతిక కారణాలతో పెండింగ్ లో ఉన్నట్లు మంత్రి నారాయణ తెలిపారు..అలాగే గత రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 319 మంది రైతులకు 1.03 కోట్లు పెండింగ్ లో ఉన్నట్లు చెప్పారు...కోర్టు కేసులతో పాటు చనిపోయిన వారికి సంబంధించిన వివాదాలతో పెండింగ్ ఉన్నట్లు మంత్రి నారాయణ స్పష్టం చేసారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలకు అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

రబీ కరువు సమయంలో, బీపీఎల్ కింద ఉన్న చిన్న, పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశుగ్రాసం అందిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం రూ. 25.16 కోట్లు మంజూరు చేసింది. పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖ నిబంధనల ప్రకారం ఈ పంపిణీ జరుగుతుంది. ఈ నిర్ణయం వల్ల కరువుతో బాధపడుతున్న రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వారి పశువులకు మేత కొరత తీరుతుంది. ప్రభుత్వం ఈ పథకం ద్వారా రైతులకు అండగా నిలుస్తోంది.

# తుఫాను సహాయ కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బంది సేవలు ప్రశంసనీయం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మోంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది కీలక పాత్ర పోషించినందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రశంసలు తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై సహాయక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి అభినందనలపై సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ కృతజ్ఞతలు తెలిపారు. తుఫాను వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజాసేవలో అంకితభావంతో పని చేయడం సచివాలయ సిబ్బందికి సహజ లక్షణమని చెప్పారు. కోవిడ్, వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలోనూ ఇదే విధంగా కీలకంగా పనిచేసినట్లు గుర్తుచేశారు.

అయితే, సచివాలయ సిబ్బంది సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవో 11ను తక్షణమే రద్దు చేయాలని, వాలంటీర్ల విధుల నుండి సచివాలయ సిబ్బందిని మినహాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆర్థిక, ఆర్థికేతర మరియు పదోన్నతుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రజాక్ కోరారు.

# అన్నప్రసాద వితరణకు విరాళం



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీశైల దేవస్థానంలోని అన్నప్రసాద వితరణ పథకానికి గుంటూరు చెందిన జి. నారాయణ తీర్థ రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావుకు ఆయన స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు దాతకు ధన్యవాదాలు తెలిపారు. విరాళ రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం దాతకు అందజేయబడ్డాయి. దేవస్థానం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సమాజంలోని మరిన్ని భక్తులు సహకరించాలని అధికారులు ఆకాంక్షించారు.

# మొంథా తుఫాన్ తీవ్రత తగ్గినా విద్యుత్, రవాణా ఇబ్బందులు

**అమలాపురం, (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ ముందుగా ఊహించినంత తీవ్రత కనబరచకపోయినా, విద్యుత్ సరఫరా మరియు రహదారి రవాణా వ్యవస్థలకు ఇబ్బందులు కలిగించిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన, మార్కెటింగ్, డైరి, రీడెవలప్మెంట్ మరియు మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి తుఫాన్ సహాయక చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుఫాన్ ఈదురుగాలుల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సుమారు 300 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, వాటి పునరుద్ధరణ పనుల్లో 80 శాతం పూర్తి అయ్యిందని, మిగిలిన 20 శాతం పనులు రాబోయే రెండు గంటల్లో పూర్తి చేసి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ఎంఈడీ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు రేయింబవళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 54 సబ్‌స్టేషన్లు తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మొదటి ప్రాధాన్యతగా ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాలి అని సూచించారని, ఆ దిశగా వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రామచంద్రపురం, రాజమహేంద్రవరం, ముమ్మిడివరం వంటి ప్రాంతాల నుండి మానవ వనరులను తరలించి విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 134 కిలోమీటర్ల మేర రహదారులపై కూలిన వృక్షాలను తొలగించి రాకపోకలను పూర్తిగా పునరుద్ధరించామని, నేటి నుండి ఆర్టీసీ బస్సులు నూటికి నూరు శాతం రాకపోకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం పునరావాస



కేంద్రాలలో భోజన వసతి పొందిన వారందరికీ బుధవారం సాయంత్రం వరకు ఆశ్రయం కల్పించి, రాత్రి భోజనం అనంతరం స్వగృహాలకు పంపించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 3,000 ఆర్థిక సహాయాన్ని వెంటనే అందజేయాలని అధికారులు ఆదేశించారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 400 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 10,150 మందికి ఆశ్రయం కల్పించామని, వీరిలో ప్రతి కుటుంబానికి రూ. 3,000 చొప్పున, ఒంటరి వ్యక్తులకు రూ. 1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు, చేనేత కార్మికులు తుఫాన్ ప్రభావంతో ఐదు రోజులుగా ఉపాధి కోల్పోయినందున వారికి 50 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. బియ్యం పంపిణీని రేషన్ డీలర్ల ద్వారా నేటి నుండే ప్రారంభించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి నిశాంతిని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల వరి పంట తుఫాన్ ప్రభావంతో నష్టపోయిందని, అలాగే ఉద్యాన పంటలైన అరటి తదితర పంటలు కూడా నష్టానికి గురైనట్లు తెలిపారు. ఈ నష్టాలను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పంటల నష్టాలను తగ్గించేందుకు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సహకారంతో చర్యలు తీసుకుంటామని, ఆర్థిక సహాయం పారదర్శకంగా అందజేయాలని సూచించారు. బియ్యం, ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసుకోవాలని ఆదేశించారు. మామిడికుదురు మండలంలో తుఫాన్ సమయంలో మరణించిన మహిళ కుటుంబానికి, పోస్ట్‌మార్టం అనంతరం ఐదు లక్షల రూపాయల పరిహారం స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుఫాన్ సహాయక చర్యల ప్రత్యేక అధికారి వి. విజయరామరాజు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఎంపీ జి. హరీష్ మాధుర్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎమ్మెల్యేలు అయితాపత్తులు ఆనందరావు, నిమ్మకాయల చిన్నరాజప్ప, అమలాపురం చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు (డిఆర్ఓ), కే. మాధవి తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం ‌ సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాల్లో ఆనందం నింపిన తీర్పు సుప్రీంకోర్టు నుంచి వెలువడింది. సెలక్షన్ కమిటీ ద్వారా అన్ని విద్యా అర్హతలతో నియమించబడి, పది నెలల క్రితం అన్యాయంగా విధుల నుండి తొలగించబడిన హెల్త్ అసిస్టెంట్లకు గౌరవ న్యాయస్థానం పెద్ద ఊరటనిచ్చింది.

1207 జీవో పరిధిలోని 920 మంది హెల్త్ అసిస్టెంట్లు తిరిగి తమ హక్కును సాధించుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సంతోష వాతావరణం నెలకొంది. విధుల నుండి తొలగించబడిన అనంతరం మృతి చెందిన హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాలకు కూడా న్యాయం చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పునఃనియామక ప్రక్రియను వేగవంతం చేస్తారని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) రాష్ట్ర కార్యవర్గం ఆశాభావం వ్యక్తం చేసింది.

గత పది నెలలుగా కోర్టులు, కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ హెల్త్ అసిస్టెంట్ల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన ఏపీ హెల్త్ అసిస్టెంట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకత్వం ప్రశంసలు అందుకుంటోంది. రాష్ట్ర అధ్యక్షులు కేవీ కిరణ్ కుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ టి. రమణారెడ్డి, రాష్ట్ర ట్రెజరర్లు ప్రభాకర్ రావు, నాగరాజు తదితర నాయకులకు, విధుల్లోకి తిరిగి చేరనున్న హెల్త్ అసిస్టెంట్లందరికీ ఏపీ హంస రాష్ట్ర శాఖ ప్రత్యేక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపింది.

## నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) :** నానో యూరియాపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం తుఫాను అనంతర పరిస్థితులను పరిశీలించుటకు ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో పర్యటించిన కలెక్టర్ కాకుమానులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో యూరియా నిలువలు, నానో యూరియాను పరిశీలించారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు ఎరువులు, నానో యూరియాను గురించి వివరించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నానో యూరియాను ఉపయోగిస్తున్న రైతుల అనుభవాలను రైతులకు తెలియజేయాలని తద్వారా ఉపయోగించుటకు ముందుకు వస్తారని చెప్పారు. రైతులకు దానిపై విశ్వాసం కలిగే వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**కొల్లిమర్లవాగు లాకులు పరిశీలన :** కాకుమాను మండలంలోని కొల్లిమర్ల గ్రామం వద్ద కొల్లిమర్లవాగు లేకులను

జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కొల్లిమర్లవాగులో పలు వాగులు కలుస్తాయని, వాగులో పూడికలు ఎక్కువగా ఉండటం వలన ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని స్థానిక రైతులు తెలిపారు. పాత బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం సక్రమంగా ఉండటం లేదని, కొత్త బ్రిడ్జి నిర్మాణం చేయడం వలన ప్రవాహానికి వెసులుబాటు కలుగుతుందన్నారు. ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు

## సాధారణ సేవలు కాదు.. విపత్కర సేవలే ముఖ్యం

**కనిపించని నాలుగో సింహమే పోలీస్**

**తుఫాన్ లో కీలకంగా మారిన పోలీస్**

**పోలీస్ శాఖలోనే కాదు ఇతర సేవలోనూ పోలీసులు**

**ఆస్తిప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవడంలో జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ కీలకం**



**బాపట్ల జిల్లా (క్రైమ్), (జర్నలిస్ట్ ఫైల్ ):**బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ జిల్లా లో తనదైన శైలిలో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు మరింత చేరువ అవుతున్నారు. జిల్లాలోని 25 మండలాల్లో,పట్టణాలలో నేరాల నియంత్రణకు జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ చేస్తున్న కృషి మంచి ఫలితాలను ఇస్తున్నాయి. మంధా తుఫాన్ నేపథ్యంలో జలాల్లో ఎక్కడ కూడా చిన్నపాటి ప్రమాదం జరగకుండా సిబ్బందిని నిద్రపోనియకుండా బాధ్యతతో విధులు నిర్వహించి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా నివారించారు. మూడు రోజులపాటు సిబ్బంది కంటి పై కునుకు లేకుండా, ఎస్పీ కూడా నిద్రపోకుండా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం నుండి రహదారులపై పడిపోయిన చెట్లను తొలగించడం, విద్యుత్ స్తంభాలు కూలిపోతే విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి పని చేయడం, రహదారులపై రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి చిన్నపాటి రోడ్డు ప్రమాదాలు లేకుండా చేయడం,గండ్లు పడిన ప్రాంతాలలో సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలకు ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకున్నారు.తుఫాన్ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మీడియా,సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసి ఎంతో అవగాహన కల్పించారు.కంట్రోల్ రూమ్ కు సమాచారం వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాల పోలీసులను అప్రమత్తం చేసి సమస్యలను పరీక్షించి శభాష్ బాపట్ల జిల్లా పోలీస్ అని నిరూపించారు.తుఫాన్ లాంటి కీలక సమయంలో తమ విధులు వారికే కాకుండా అన్ని శాఖల విధులు నిర్వహించే విధంగా జిల్లా ఎస్పీ పని చేసి ప్రజల మనస్సును గెలుచుకున్నారు.జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని సమర్థవంతమైన సేవలు అందించామని,ఎప్పటికప్పుడు ఎస్పీ ఆదేశాలను అందుకుంటూ జిల్లాలో తుఫాన్ ప్రభావం తో ప్రమాదాలు,ప్రాణ, ఆస్తి, ఏ ఒక్కరికి చిన్నపాటి ప్రమాదం లేకుండా విధులు నిర్వహించామని అందుకు ఎంతో సంతోషంగా ఉందని ఓ పోలీస్ అధికారి అన్నారు. సాధారణ పరిస్థితుల్లో విధులు నిర్వహించడమే కాకుండా విపత్కర పరిస్థితుల్లో కూడా ఎంతో బాధ్యతగా తమ చేత విధులు నిర్వహించి ప్రాణ నష్టం, రోడ్డు ప్రమాదాలు లేకుండా పని చేపించారని ఎంతో గర్వంగా ఉందన్నారు.కనిపించే మూడు సింహాలతో పాటు కనిపించని నాలుగో సింహమే పోలీస్ అనే విధానాన్ని బాపట్ల జిల్లా పోలీసులు నిరూపించారు.

## మూడు గంటల్లో మూడు జిల్లాల్లో సుడిగాలి పర్యటన



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీని వణికించిన మొంథా తుఫాను విషయంలో అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించిన సీఎం చంద్రబాబు.. ఈ తుఫాను తీరం దాటిన వెంటనే ఆయన ఆయా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. మూడు గంటల్లో మూడు జిల్లాలను ఆయన చుట్టి వచ్చారు. దీనికి గాను.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ సేవల కోసం పంపించిన చేతక్ హెలికాప్టర్‌ను వినియోగించుకున్నారు. విపత్తుల సమయంలోనూ ఈ హెలికాప్టర్ చురుగ్గా పనిచేస్తుంది. అంతేకాదు.. కొంత మేరకు ప్రతికూల వాతావరణం ఉన్నా.. ఈ హెలికాప్టర్ సహకరిస్తుంది.

ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య మూడు జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేసి.. తుఫాను మిగిల్సిన నష్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. సహాయక చర్యలకు కూడా ఆదేశించారు. తొలుత ఉండవల్లి నుంచి బాపట్లకు చేరుకున్న ఆయన.. దెబ్బతిన్న పంటపొలాలు, ఇళు,, గ్రామాలను పరిశీలించారు. అనంతరం.. కలెక్టర్ ఆఫీసులో నిర్వహించిన సమీక్షలోనూ పాల్గొన్నారు. బాధితులను ఆదుకుంటామనిభరోసా ఇచ్చారు. ఇక, అక్కడి నుంచి కృష్ణా జిల్లాకు వచ్చారు. ఇక్కడ కూడా దెబ్బతిన్న ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు.

అటు నుంచినేరుగా కోనసీమ జిల్లాకు వెళ్లారు. అయితే.. ఇక్కడ ఏరియల్ సర్వే అనంతరం.. కలెక్టర్ ఆఫీసుకు వెళ్లేందుకు కాన్వాయ్ రెడీ అయినా.. కొంత ఇబ్బంది ఏర్పడింది. దీంతో ఆయన ఓ కార్యకర్తకు చెందిన ఇన్నోవా కారులో ప్రయాణించి.. బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ వారితో నేరుగా మాట్లాడారు. బాధలు సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా మత్స్యకారుల సమస్యలు విన్నారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఇలా.. మూడు గంటల్లో ఏరియల్ సర్వేతో పాటు.. కలెక్టర్ల కార్యాలయాల్లో సమీక్షలు.. చేయడం పునరావాస కేంద్రాల్లో ని బాధితులకు ఓదార్పు ఇవ్వడం గమనార్హం.

**సీఎం ప్రకటించిన సాయం ఇదే..** తుఫాను బాధ్యులకు సీఎం చంద్రబాబు ఆర్థిక సాయం ప్రకటించారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు రూ. 1000 నుంచి రూ. 3000 వరకు గరిష్ఠంగా సాయం.,ప్రతి కుటుంబానికీ 25 కిలోల బియ్యం, గోధుమలు 3 కిలోలు.. నిత్యావసరాలు పంపిణీ. దెబ్బతిన్న రహదారులను 48 గంటల్లో పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. పంటల నష్టం అంచనాకు మూడు రోజుల సమయం వెంటనే కేంద్రానికి లేఖ. రాసినట్లు చెప్పారు. కేంద్రంసాయం రాగానే.. రైతులకు అందజేస్తామని సీఎం చెప్పారు.

# శభాష్ కలెక్టర్ అన్సారియా

- **తుఫాను ఏర్పాట్లతో విజయం**
- **కలెక్టర్ చొరవ అభినందనీయం**
- **వర్షంలోనూ పలు ప్రాంతాలలో పర్యటన**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫానుకు పక్కా ప్రణాళిక ప్రకారం ముందస్తు ఏర్పాట్లు చేయడంలో జిల్లా యంత్రాంగ సఫలమైంది.

మొంథా తుఫాను హెచ్చరికలు జారీ కావడం, వెనువెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేయడంతో గుంటూరు జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తమయింది.

ప్రతి మండలానికి, మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారులను నియమించారుజిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశారు.

జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా 27వ తేదీన తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, మంగళగిరి, తుళ్లూరు మండలాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అధికారులకు తగిన సూచనలు చేశారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, రెవెన్యూ డివిజనల్ అధికారి మండల ప్రత్యేక అధికారులు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించడం లో సఫలీకృతులయ్యారు.

జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళగిరి మండలం కొత్తపేట ప్రాంతంలో ప్రత్యేకంగా పర్యటించారు. ఆ ప్రాంతం కొండ దిగువున ఉండటం వలన కొండ చరియలు, బండ రాళ్లు పడే అవకాశం ఉండటంతో వాళ్లందరికీ పునరావాస కేంద్రాలకు సోమవారం ఉదయమే తరలించడం జరిగింది.

తుఫాన్ కు జిల్లాలో 153 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి తొమ్మిది వేల మందిని తరలించారు. ప్రమాదాలు జరుగుటకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో సిబ్బందిని క్షేత్రస్థాయిలోనే నియమించి అచ్చట నుంచే పర్యవేక్షించి తగిన సూచనలు చేశారు.

ప్రజలకు ఎటువంటి ఇబ్బంది జరగకుండా పూర్తిస్థాయిలో అన్ని చర్యలు చేపట్టడంతో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజల ఇబ్బందులే మన ఇబ్బందులు అనే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా యంత్రాంగం పనిచేసింది అనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రి సైతం మంగళవారం అర్ధరాత్రి వం-కు రాష్ట్ర సచివాలయంలో ఉంటూ నిరంతరం పర్యవేక్షణ చేశారు. దీంతో అధికారులు సైతం పూర్తి అప్రమత్తంగా ఉన్నారంగంలో ఎటువంటి అనుమానం లేదు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనల జరగలేదు.

మంగళవారం ఉదయం నుండే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు విస్తృతంగా వివిధ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. రాత్రి కూడా పలు ప్రాంతాల్లో పర్యటించారు. బుధవారం ఉదయం నుండే తుఫాను అనంతర పరిస్థితులను కూడా గమనించుటకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటనలు చేశారు.

ఎక్కడ ఎటువంటి ఆరోపణలు రాలేదు. పునరావాస కేంద్రాలకు సైతం స్వయంగా వెళ్లి పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న 9,000 మందికి నిత్యావసర సరుకుల పంపిణీకి కిట్లను సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నగదును కూడా అందచేయుటకు ఏర్పాట్లు చేస్తున్నారు.

84 చెట్లు రహదారుల మీద పడిన వెంటనే తొలగించారు..

23 విద్యుత్ సబ్ స్టేషన్లు మరమ్మలకు గురికాగా వాటిని పునరుద్ధరించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, కలెక్టర్ అన్సారియా స్పందించిన తీరు హర్షం వ్యక్తం అవుతోంది..

## ఉత్తర కొస్తాను గడగడలాడించిన.మొంథా తుఫాన్ !

- **ఉగ్రరూపం దాల్చిన సముద్రం**
- **చిగురుటాకుల వణికిన పలు జిల్లాలు**
- **తీరం దాటే సమయంలో భీభత్సం**





**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** సముద్రుడు ఉగ్రరూపం దాల్చాడు. ఎట్టకేలకు తుఫాన్ తీరాన్ని దాటింది. ఉత్తరకొస్తాలోని కొన్ని జిల్లాల్లో ఈ వర్షం బీభత్సం సృష్టించింది ఈ.

మొంథా తుఫాన్ ఎట్టకేలకు ఏపీలో తీరాన్ని దాటడంతో గత నాలుగు రోజుల నుంచి హైరానా పడుతున్న ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. అంతర్వేదిపాలెం వద్ద మంగళవారం రాత్రి ప్రవేశించి అర్ధరాత్రి దాటిన తరువాత పూర్తిగా ల్యాండ్ అయింది. ఇక అనంతరం మొంథా తుఫాన్ బలహీనపడిపోయింది. అయితే గత కొన్ని రోజులుగా సముద్రంలో ఉంటూ నానా విధాలుగా ఏపీని ఇబ్బంది పెట్టిన మొంథా తుఫాన్ తీవ్ర అల్ప పీడనంగా రూపాంతరం చెందినా సముద్రం మాత్రం ఇంకా శాంతించలేదు. ఏపీలో చాలా చోట్ల చూస్తే సముద్రం ముందుకు దూసుకుని వచ్చింది. తీరాన్ని భారీగా కోసేసింది. దీంతో సాగరుడి ఉగ్ర రూపం చూసి తీర ప్రాంత ప్రజలు భీతిల్లుతున్నారు. సముద్రంలోనే అనేక పీడనాలు ఉంటాయి. అక్కడే మూల కేంద్రం. అందులో ఒకటి మరింతగా బలపడి ఒక తుఫానుగా అవతారం ఎత్తుతుంది. దాని ప్రభావం నాలుగైదు రోజులు ఉంటుంది. అది కాస్తా తీరం దాటి తిరిగి మెల్లగా సముద్రంలోకే వెళుంది. అంటే ఈ అలజడి సముద్రంలోనే అలాగే ఉంటుంది అన్న మాట. తీరం చేరినపుడు తిరిగి సముద్రంలోకి వెళ్ళినపుడు కూడా సముద్రం తీవ్ర ఆటుపోట్లకు గురి అవుతుంది. అదే సమయంలో ఈదురు గాలులు బలంగా వీస్తాయి. మరో వైపు ఈ గాలి వేగానికి అలజడులకు సముద్రం అతలాకుతలం అయి కెరటాలు పెద్ద ఎత్తున ఎగిసిపడతాయి దాంతో పాటు వెనక ఉన్న నీళ్ళన్నీ ముందుకు తోసుకుని వస్తాయి. ఆ జోరులో సముద్రం రెండు అంగలు ముందుకు వేసి తీరాన్ని మరింతగా చొచ్చుకుని వచ్చినట్లుగా కనిపిస్తుంది. తుఫాన్ అనంతరం సముద్రం సాధారణ స్థితికి చేరుకోవడానికి కనీసం రెండు రోజులు పడుతుందని ఒక అంచనా ఉంది.

రోజులు పడుతుందని ఒక అంచనా ఉంది.!

శ్రీకాకుళం నుంచి : ఏపీకి పొడవైన తీర ప్రాంతం ఉంది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా తడ వం-కూ తీరం అంతా ఒకే రేఖ మీద సాగుతుంది. ఇపుడు చూస్తే మొంథా తుఫాన్ తరువాత మొత్తం తొమ్మిది ఉమ్మడి జిల్లాలోని తీర ప్రాంతంలో సముద్రం ఒక్కసారిగా కొన్ని అడుగులు ముందుకు జరిగి తీరాన్ని భారీగా తాకుతోంది. దాంతో సముద్రం ముందుకు వచ్చింది అని స్థానిక జనాలు భయపడుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో డొంకూరు నుంచి ఉమ్మడి నెల్లూఒరు జిల్లా తడ వరకూ ఇదే విధంగా సముద్రం ముందుకు వచ్చి తీరాన్ని వణికించేస్తోంది. బుధవారం ఈ రకమైన పరిస్థితిని చూసి స్థానికంగా నివాసం ఉంటున్న మత్స్యకార కుటుంబాలు తీవ్రంగా భయపడుతున్నారు.

తుఫాన్ ఎపుడు వచ్చినా సముద్రం అల్లకల్లోలంగానే ఉంటుంది. అయితే అదే సాగరం మీద జీవనం సాగిస్తూ దాని మీదనే ఆరుగాలం ఆధారపడిన మత్స్యకార కుటుంబాలకు ఇవన్నీ తెలుసు అందుకే సముద్రం ఆగ్రహంగా ఉందని గ్రహించి శాంతించమంటూ పూజలు చేస్తున్నారు. మత్స్యకార మహిళలు పూజలు చేస్తూ ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నారు. కాకినాడ తీరంలో చూసినా ఇదే రకమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ తాళ్ళరేవు వద్ద సముద్రం బీభత్సంగా మారింది. తీరాన్ని పూర్తిగా తవ్వేస్తూ మొత్తం అన్ని కోస్తా జిల్లాలలో సముద్రం చేస్తున్న అలజడికి జనాలు ఉలిక్కిపడుతున్నారు. అయితే ఇదంతా మరి కొన్ని గంటల వరకూ ఉంటుందని ఆ మీదట మెల్లగా పరిస్థితిలో మార్పు కనిపిస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఎవరూ సముద్రం వైపు వెళ్ళవద్దని బీచ్ లకు అసలు పోవద్దని సూచిస్తున్నారు యధాతథంగా వాతావరణం వచ్చేంతవరకూ తగిన జాగ్రత్తలో ప్రజలు ఉండాలని, మత్స్యకారులు అయితే నవంబర్ నెల వచ్చెంతరవకూ ఇళ్ళ వద్దనే ఉండాలని కోరుతున్నారు. అయితే గత కొన్ని సంవత్సరాల నుండి భూగోళం మీద పరిశీలించినట్లయిత ఋతువులు గతి తప్పుతున్నాయి. సముద్రాల్లో తుఫాన్లు, వాయుగుండాలు ఏర్పడినప్పుడు మాత్రమే భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈసారి ముంతా తుఫాన్ బంగాళాఖాతంలో ఏర్పడిన వెంటనే ప్రభుత్వం గత వారం నుంచి అనేక చర్యలు తీసుకుంది. దీనివల్ల ప్రాణ నష్టం జరగలేదు. అయితే ఉత్తరకొస్తా జిల్లాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగింది. మత్స్యకారుల జీవనం అతలాకుతలమైంది. అంతేకాకుండా కోస్తా జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది.

## ఆలపాటి నగర్ వాసుల మౌలిక సమస్యలపై దృష్టిపెట్టిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్రాప్యారీస్ గా పిలుచుకునే తెనాలిలొ అ-పార్ట్మెంట్ కల్చర్ కు నైలవైన ఆలపాటి నగర్ లొ, రోడ్డు సమస్య,సైడ్ కాలువలు, వీదిదీపాల సమస్యను ఆప్రాంత వాసులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు దృష్టికి తెచ్చిన వైనమిది.

స్థానిక సుల్తానాబద్ ఆలపాటి నగర్ లొ మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించిన ఆప్రాంత వాసుల అభ్యర్ధన మేరకు, బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆలపాటి నగర్ లొ పర్యటించి ఆప్రాంత మహిళల ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. తక్షణ పరిష్కార దిశగా, మున్సిపల్ కమీషనర్ అప్పల నాయుడుకు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఫోన్ ద్వారా పలు సూచనలు చేశారు. వీధి దీపాల సమస్య త్వరిత గతిన పరిష్కరించాలని సూచించారు. ఈక్రమంలొ తమ ప్రాంత సమస్యలు, 2019 నుండి,సుధీర్గ కాలంగా, ఎంతొ మంది, అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళామని, గత ప్రభుత్వంలొ ఉన్న, ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళామని, గడచిన ఎన్నికల ప్రచారంలొ, ప్రస్తుత మంత్రి మనోహర్ కు, వినతి పత్రం సమర్పించామని తెలిపారు.ఎమ్మెల్సి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ద్వారా తమ ప్రాంత మౌలిక సమస్యలకు పరిష్కారం లభించగలదనే ఆశాభావం ఆప్రాంత మహిళలు వ్యక్తం చేశారు.ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వెంట పార్టీ నాయకులు ఖుద్దూస్, రావి కృష్ణమోహన్, కోగంటి రాజేష్, జొన్నాదుల మహేష్ అమిరినేని రాజ, తదితరులున్నారు.

## నియామక ప్రక్రియ ప్రారంభమయ్యాక ఉద్యోగ అర్హతలు మార్చడం సరికాదు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ఉద్యాన సహాయకుల నియామక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అర్హతలను మార్చడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆట మొదలయ్యాక క్రీడా నిబంధనలను మార్చేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. గ్రామ సచివాలయాల పరిధిలో వీహెచ్ఏ ఉద్యోగాల 'అర్హత' విషయంలో కొత్త నిబంధనలను తీసుకు వచ్చింది. దీన్ని పూర్వ తేదీ నుంచి (రెట్రాస్పెక్టివ్) అమలు చేసేందుకు చట్ట విరుద్ధమంది. రాత పరీక్షలో అర్హత సాధించిన పిటిషనర్లను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే, తాజా మెరిట్ లిస్ట్ ప్రచురించి, ఫలితాల ప్రకటనకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఇప్పటికే ఎంపికైన వారి కంటే కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు ఎక్కువ మెరిట్ సాధించి ఉంటే గనక భవిష్యత్తు పదోన్నతుల్లో వారికి ఎటువంటి నష్టం జరగకుండా నోషనల్ సీనియారిటీ కల్పించాలి. ఈ ప్రక్రియను 3 నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఈ మేరకు కీలక తీర్పును వెలువరించారు.

పోస్టుల నియామకానికి ప్రకటన జారీ: 2019లో గ్రామ సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆ సంవత్సరం జులైలో కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా 4 వేల వీహెచ్ఏ పోస్టుల నియామకానికి ప్రకటన జారీ చేసింది. బీఎస్సీ (హార్టికల్చర్)/(హానర్స్), హార్టీకల్చర్/బీటెక్, హార్టికల్చర్ డిప్లొమా చేసిన వారు, తదితర అభ్యర్థులు అర్హులుగా పేర్కొంది. 4,000 పోస్టుల్లో 2,217 మాత్రమే భర్తీ అయ్యాయి. మిగిలిన 1,783 పోస్టుల భర్తీకి 2020 జనవరిలో మరో నోటిఫికేషన్ జారీ చేసింది.

హార్టికల్చర్ శాఖలో పని చేస్తున్న మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ అధికారి (ఎంపీఈవో), మైక్రో ఇరిగేషన్ అసిస్టెంట్ అధికారి (ఎంఐఏవో) అభ్యర్థన మేరకు అర్హతలో సవరణలు తీసుకు వచ్చింది. బీఎస్సీ (బీజెడ్‌సీ) లేదా బీఎస్-సీ, ఎంఎస్సీలో హార్టికల్చర్‌ను ఒక సబ్జెక్ట్ చదివిన వారు, 10o2తో ఒక సంవత్సరం హార్టికల్చర్ డిప్లొమో, బీఎస్సీ (అగ్రి) చేసినవారు, తదితరులను రాత పరీక్షకు అనుమతించింది.

2020 జూన్‌లో రాత పరీక్షకు 5 రోజుల ముందు ఏపీ హార్టికల్చర్ సబార్డినేట్ సర్వీసు నిబంధనలను ప్రభుత్వం సవరించింది. తద్వారా గతంలో ఇచ్చిన అ-ర్హతల సడలింపును రద్దు చేశారు. దీని వల్ల ప్రభావితులైన అభ్యర్థులు హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు.

పిటిషనర్ల తరఫున న్యాయవాదులు జీవీ శివాజీ, వై. మల్లికార్జునరెడ్డి, ఆర్. హరీష్‌కుమార్ వాదించగా, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది కల్యాణ్ చక్రవర్తి వాదనలు వినిపించారు.

ఇరువైపు వాదనలూ విన్న న్యాయమూర్తి, చట్టపరమైన నిబంధనలు లేనప్పుడు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా పోస్టుల భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టవచ్చని స్పష్టతనిచ్చారు. 'ప్రస్తుత వ్యాజ్యాల విషయంలో 2020 జనవరి 10న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హతల్లో సవరణ చేస్తూ 2020 జూన్‌లో తెచ్చిన నిబంధనలను అంతకు ముందు ఇచ్చిన నోటిఫికేషన్‌కు వర్తింపచేయడం సముచితం కాదు' అని తీర్పులో పేర్కొన్నారు.

## డివిజన్ లొ విద్యుత్ శాఖకు 20లక్షల వరకు ఆస్తినష్టం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** మొంథా తుఫాన్ కారణంగా విద్యుత్ శాఖకు, తెనాలి డివిజన్ పరిదిలొ 20 లక్షల వరకు ఆస్తి నష్టం ఏర్పడిందని విద్యుత్ డిఇ అక్కల సత్యన్నారాయ పేర్కొన్నారు.స్థానిక చెంచుపేటలొని విద్యుత్ డిఇ కార్యాలయంలొ బుధవారం డిఇ సత్యనారాయణ మీడియాతొ మాట్లాడుతు, మొంథా తుఫాన్ కారణంగా ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా, తుఫాన్ తీరం దాటాక, ఎదురైన విద్యుత్ అంతరాయ సమస్యలను, సకాలంలొ పూర్తి చేయగలిగామని అన్నారు. శాఖా పరంగా, ముందస్తుగా జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలమేరకు, తమకున్న 275మంది సిబ్బందితొ పాటు, మరో 150 మంది ప్రైవేటు సిబ్బందిని క్షేత్ర స్థాయిలొ ఉంచడం ద్వారా, ఎప్పటి సమస్య అప్పుడే పరిష్కరించగలిగామని, సహకరించిన సిబ్బందికి, ఇతర విభాగాల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. తుఫాన్ కారణంగా, విద్యుత్ వైర్లు తెగినా, విద్యుత్ స్ధంబాలు, ట్రాన్ఫార్మర్ లు పాడైనా, ఎక్కడ ఏవిధమైన ప్రాణ నష్టం లేకుండా, అప్రమత్తమైన సిబ్బంది పనితీరును డిఇ ప్రశంశించారు. 65,విద్యుత్ పోల్స్,12 ట్రాన్ఫార్మర్ లు, నిరుపయోగం కావడంతొ, 20లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.



## భక్తిమార్గంతోనే జీవితానికి ధన్యత


- ఇస్కాన్ ధర్మప్రచారకులు కీర్తిరాజదాస్ స్వామి
- ఆలూరులో ప్రారంభమైన తి.తి.దే. ధార్మిక కార్యక్రమాలు

**ఆలూరు, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్)**

భక్తిమార్గంతోనే జీవితానికి ధన్యత చేకూరుతుందని, ప్రతివ్యక్తి భక్తిమార్గంలో నడవాలని ఇస్కాన్ ధర్మప్రచారకులు కీర్తిరాజదాస్ స్వామి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రమైన ఆలూరులోని శ్రీ సాయిబాబా మందిరం నందు ధార్మిక కార్యక్రమాలు మొదటి రోజు వారు భాగవతంలోని కార్తిక దామోదరలీలపై ప్రవచించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ మంగళవారం నుండి శుక్రవారం వరకు ప్రతిరోజు సాయంత్రం ప్రవచనాలు మరియు భజనలు శుక్రవారం ఉదయం 10 గంటలకు గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జి. శ్రీనివాసులు రెడ్డి, వై. వీరభద్ర గౌడ్, పి.రామాంజనేయరెడ్డి, ఒ.వీరభద్ర గౌడ్, విశ్వహిందూ పరిషత్తు మఠమందిర ప్రముఖ్ భరత్ కుబేర, కమిటీ సభ్యులు బి.ఎర్రిస్వామి, జె. మల్లికార్జున, ఎస్.బి. శ్రీనివాసులు, బి. సూర్యనారాయణ, బి. రఘునాథ్ రెడ్డి, కె.లోకన్న గౌడ్, జె.సిద్ధ లింగయ్య స్వామి, బి. మల్లిఖార్జున, ఎం నాగేంద్రయ్య అర్చకులు జె.ఎర్రి స్వామి, నాగభూషణం స్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆకలితో ఉన్న వాళ్ళకి ఆకలి తీర్చినందుకు సంతోషంగా ఉంది

- డొక్క సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయ కుమారి



**విజయవాడ, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్)**

ఈ వర్షాలకి పనులు లేక ఆకలితో భోజనం కోసం ఎదురు చూసే వాళ్ళ కోసం డొక్క సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డొక్క సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయ కుమారి మాట్లాడుతూ ఆకలితో ఉన్న వాళ్ళకి ఆకలి తీర్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. అన్నదానానికి సహాయం చేసిన లక్ష్మీ వెంకట మల్లీశ్వర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## తప్పిపోయిన కొడుకు ను తండ్రికి అప్పగించిన ఆగిరిపల్లి ఎస్సై శుభశేకర్




**ఆగిరిపల్లి, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్)**

ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రాల గ్రామానికి చెందిన, రాయల నవదీప్ వయసు 12 సంవత్సరాలు, మంగళవారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో, అతను తప్పిపోయి ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామం వచ్చినట్లు, ఆగిరిపల్లి పోలీసు వారు, సదరు బాలుడిని గమనించి పిఎస్ కు తీసుకువచ్చారు. తనకు భోజనం పెట్టి సదరు బాలుడు ఫోటోను చుట్టుప్రక్కల పోలీస్ స్టేషన్ లకు పంపగా, బాలుడి తండ్రి ఆచూకీ తెలుసుకొని ఆగిరిపల్లి పిఎస్ కు రాగ బాలుడిని తుఫాను సమయంలో సురక్షితముగా తండ్రికి అప్పగించారు. బాలుడు దొరికినందుకు తండ్రి సంతోష పడినారు, ఎస్సై శుభశేఖర్ కు మరియు పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## వలస కార్మికులను శిబిరాలకు తరలించండి

- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముంపును నివారించాలి
- ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**గన్నవరం, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్)**



కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, తుఫాన్ ముంపు బారిన పడిన ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాల వలస కార్మికులను సైతం సహాయ పునరావాస శిబిరాలకు తరలించి వారికి ఆహారాన్ని అందించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. మెంతా తుఫాను సహాయ కార్యక్రమాలపై మంగళవారం సాయంత్రం గుడివాడ ఆర్డీవో తో పాటు గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల తాసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా తుఫాన్ తీవ్రతను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి పలు సూచనలు ఇచ్చారు. మంగళవారం రాత్రి నుంచి వర్ష తీవ్రత పెరిగే ప్రమాదం ఉన్నందున అధికారులందరు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని యార్లగడ్డ సూచించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు కు ప్రభుత్వ పాఠశాలలు చాలకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అందుబాటులో ఉన్న ప్రయివేటు భవనాలలో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత ఏడాది బుడమేరు ముంపును దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అప్పట్లో చెరువులు, కాలువలకు గండ్లు పడిన ప్రాంతాలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలన్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయించి వర్షపు నీరు సక్రమంగా పారుదలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

# కొండ ప్రాంతాల ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి





- ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాం
- రియల్ టైమ్ డేటా ఆధారంగా క్షేత్రస్థాయి బృందాల చర్యలు
- అవసరమైన ఔషధాలను అందుబాటులో ఉంచాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్)**

మొంథా తుపాను నేపథ్యంలో విజయవాడ అర్బన్ పరిధిలో కొండ ప్రాంతాల ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టడం జరిగిందని.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్, వ్యవసాయం, ఇరిగేషన్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ సూచనలు మేరకు జిల్లాలో విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రత్యేకంగా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విజయవాడ అర్బన్ ప్రాంతంలో కొండ ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడేందుకు అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి.. ముప్పు ఉన్న ఆవాసాల్లోని వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. నిండు గర్భిణీలతోపాటు తక్షణ వైద్య సాయం అవసరమైన వారిని గుర్తించి సమీప ఆసుపత్రులకు తరలించి.. సేవలందిస్తున్నట్లు తెలిపారు. దుర్బలమైన 25 రహదారులను, ఆరు చెరువులను గుర్తించి ప్రత్యేక ప్రణాళికతో అప్రమత్తంగా ఉన్నట్లు వివరించారు. అవసరమైన మందులతో పాటు 108, 104 ద్వారా సమర్థవంతంగా సేవలందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని పీహెచ్‌సీల పరిధిలో వాహనాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వర్షాలు పడుతున్నప్పుడే కాకుండా తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని.. అంటు రోగాలు వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్య శాఖ.. సమన్వయ శాఖలతో కలిసి పనిచేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

### పునరావాస కేంద్రాన్ని సందర్శించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

మంత్రి సత్యకుమార్ యాదవ్.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి విజయవాడ అర్బన్ పరిధిలోని చిట్టినగర్ రాకేష్ ఈఎం హైస్కూల్‌లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్నవారితో మాట్లాడి బాగోగులను అడిగి తెలుసు కున్నారు. అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు.

# విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

- పుకార్లు నమ్మవద్దు తుఫాను బాధితులందరికీ పరిహారం ఇస్తాం
- తుఫాన్ బాధితుల ఆకలి తీర్చేందుకు అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తా
- ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్)**

కోస్తాజిల్లాలను వణికిస్తున్న మెంతా తుఫాను తీవ్రత కారణంగా ఎటువంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు గన్నవరం నియోజకవర్గంలో ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని తుఫాను పునరావాస శిబిరాలను మంగళవారం మధ్యాహ్నం యార్లగడ్డ సందర్శించారు. ముందుగా చెంచుల కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని అనంతరం కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస శిబిరంలోని వసతులను పరిశీలించిన ఆయన బాధితులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ గన్నవరం మండలంలోని కేసరపల్లి గ్రామం తోపాటు చన్నుపల్లి వారి గూడెం, కట్టుబడి పాలెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి 450 మందిని శిబిరాలకు తరలించినట్లు తెలిపారు. శిబిరాలలో తలదాచుకున్న బాధితులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదృష్టవశాత్తు ఇతర జిల్లాలతో పోల్చుకుంటే కృష్ణా జిల్లాలో తుఫాను ప్రభావం తక్కువగా ఉందని, గన్నవరం నియోజకవర్గంలో వర్షపాతం తక్కువగా నమోదు అయిందన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని అధికారులు అందరూ తుఫాన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస శిబిరాలకు తరలించేందుకు కృషి చేస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. వాతావరణ శాఖ అధికారుల అంచనాల మేరకు భారీ వర్షాలు కురిస్తే పునరావాస శిబిరాలను మరిన్ని పెంచాల్సి ఉంటుందని, ఇందుకోసం అవసరమైతే గతంలో బుడమేరు వరదల మాదిరిగా తన సొంత నిధులు వెచ్చించి కళ్యాణ మండపాలను అద్దెకి తీసుకొని బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుఫాన్ బాధితులకు సాయం పై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని పుకార్లు నమ్మవద్దని హితవు పలికారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా బాధితులందరికీ ప్రభుత్వ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. స్థానికులు ఇళ్ల స్థలాలు సమస్యను ప్రస్తావించగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశం ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉందని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వెంటనే ఇల్లు లేని పేద వారందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సాయం అందించాలని మహిళలు కోరగా సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బిజెపి నాయ కులు, కార్యకర్తలు తుఫాన్ సహాయ చర్యల్లో పాల్గొని ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో తుఫాన్ బాధితులకు అండగా ఉండాలని యార్లగడ్డ పిలుపునిచ్చారు. జోరు వానలో తడుస్తూనే యార్లగడ్డ సహాయ శిబిరాలను సందర్శన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చిరుమామిళ్ల సూర్యం, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, దయ్యాల రాజేశ్వరరావు, గొడ్డళ్ళ చిన్న రామారావు, కొలుసు రవీంద్రబాబు, టిడిపి నాయకులు సర్నాల బాలాజీ, కొల్లా ఆనంద్, బొప్పన హరికృష్ణ, బోడపాటి రవి , కోనేరు సందీప్, కుందేటి చంద్రశేఖర్, కోసూరు వెంకట్, అన్నే హరికృష్ణ, మల్లంపాటి జయకృష్ణ, కొసరాజు సాయిరాం, మేడేపల్లి రమ, జాస్తి శ్రీధర్, బండి వెంకట్రావు, కొమ్మరాజు సుధీర్, పడమట రంగారావు, బుస్సే నాగప్రసాద్, పరుచూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో

# మంత్రి పార్థసారథి విస్తృత పర్యటన

- తుఫాను పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన సూచనలు చేయాలి
- ఆగిరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుమారు. రూ.1లక్ష మంజూరు
- గృహనిర్మాణం, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లి, అక్టోబరు 29(జర్నలిస్ట్ ఫైల్)**

మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో గృహనిర్మాణం, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లి మండలం, నెక్కలం గొల్లగూడెం, ఆగిరిపల్లి గ్రామాల్లో మంత్రి పార్థసారథి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆగిరపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలో గండిపడి తెగిపోయిన చెరువును మంత్రి పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై మంత్రి అధికారులను అడిగి ఆరా తీశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు నష్టనివారణ చర్యలపై అధికారులు, స్థానిక ప్రజలతో చర్చించి. నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. ఆగిరపల్లి గ్రామంలో కల్వర్టు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిన ప్రాంతాన్ని నీటి వసతులను పరిశీలించి రూ.1 లక్ష మంజూరు చేశారు. మొంథా తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కట్ట తెగిపోయిన చెరువుల వద్ద తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజలకు తుఫాను ప్రభావం ఏ విధంగా ఉండబోతుంది ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించాలని అధికా రులకు ఆదేశించారు. ప్రజలంతా సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, అధికారులు చెప్పే సూచనలు తూచ తప్పకుండా పాటించాలని కోరారు. తుఫాను తీరం దాటి, వాతావరణం అనుకూలించే వరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల ని తెలిపారు. తుఫాను నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్రజలకు అందించాల్సిన సహాయ సహకారాలపై మంత్రి స్థానికులకు వివరించారు. నియోజక వర్గంలో ఆస్తి పంట నష్టం పై పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదిక తుఫాను తదనంతరం సమర్పించాలని అధికారులకు సూచిం చారు. పోలీసు రెవిన్యూ, పంచాయతీరాజ్ ఆర్&బి అధికారులు ఎప్పటికప్పుడు గట్లు తెగిన చెరువుల వద్ద నిఘా పెట్టాలని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తహశీల్దార్, మండలస్థాయి అధికారులు, స్థానిక అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'మొంథా' దృష్టిలో పెట్టుకొని కొనుగోళ్లలో వేగం పెంచండి



## తూకం తర్వాతి పనుల బాధ్యతంతా అధికారులదే: రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

## 3,814 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం : పౌర సరఫరాల జీఎం నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :** కొనుగోలు కేంద్రాల వద్ద తూకం అయ్యాక మిగతా విషయాలన్నిటికీ అక్కడి అధికారులదే బాధ్యత ఉండేలా చూడండి, రైస్ మిల్లులకు తరలించే వరకు రైతులకు బాధ్యత పెట్టొద్దని ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అన్నా రు. రైతు కమిషన్ ఛైర్మన్ అధ్యక్షతన బీఆర్కె భవన్‌లో మంగళవారం వరిధాన్యం కొనుగోలుపై సమీక్ష చేశారు.

మొంథా తుఫాన్ దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల వద్ద వుండే అధికారులు వేగవంతంగా పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా తూకం వేయాలన్నారు. అదేవిధంగా లారీలకు ఎక్కించిన ధాన్యం రైస్ మిల్లులకు వెళ్లేదాకా రైతులను బాధ్యుల్ని చేయొద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కాంటా పూర్తికాగానే రైస్ మిల్లులకు తరలించే బాధ్యత కొనుగోలు కేంద్రాల్లో వుండే అధికారులు, సిబ్బంది చూసుకోవా లన్నారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ, ఏర్పాట్లు, ఇతర సదుపా యాలపై పౌరసరఫరాల శాఖ అధికారి ప్రొక్యూర్మెంట్ జీఎం నాగేశ్వర్‌రావుతో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి అడిగి తెలుసు కున్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణకు రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు జీఎం నాగేశ్వర్ రావు కమిషన్‌కు వివ రించారు. అందులో 4.428 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన 3,814 కేంద్రాలు ప్రారంభించ డానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కూడా ఏర్పాట్లు చేసిన విషయాన్ని కమిషన్ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ అధికారులు సంధ్య రాణి, హరి వెంకట ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

# 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక లోక్‌అదాలత్‌ల ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న కాంపౌండింగ్ కేసుల పరిష్కారం కోసం నవంబర్ 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నారు. దీనికి సంబం ధించిన ఏర్పాట్లపై రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మంగళవారం నాడు హైకోర్టులో పోలీసు ఉన్నతాధికారులతో ఒక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్‌గా వున్న హైకోర్టు జడ్జి శ్యాం కోషి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి డిజీపి శివధర్ రెడ్డితో పాటు శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, సిఐడి చీఫ్ చారు సిన్హా, లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి, జుడిషియల్ విభాగం పరిపాలనాధికారి ఎం.రాజు తదితరులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్, హైకోర్టు జడ్జి శ్యాం కోషి ప్రత్యేక లోక్ అదాలత్‌లు విజయవంతం అయ్యేందు కు పోలీసుల సహకారం వుండాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసుల విషయంలో చొరవ చూపాలలని ఆయన కోరారు. దీనిపై డిజిపి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు విజయవంతం అయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు.



# తుఫాన్‌తో రైతులు అప్రమత్తంగా ఉండాలి

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :** తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పత్తి రైతులు జాగరూకతో వ్యవహరించాలన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం రైతు నేస్తం వీడియోకాన్ఫరెన్స్‌లో మట్లాడుతూ తీసిన పత్తి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తేమ శాతం 12 శాతం మించకుండా చూడాలని తెలిపారు. మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమ శాతం 20 వరకు ఉన్నప్పటికి పత్తి కొనుగోళ్లు జరపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 72 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారన్నారు. తొలిరోజు 784 మంది రైతులకు చెందిన 1,623 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 28 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనాలు ఉన్నాయన్నారు.

# వరంగల్ ఎంజిఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ హారీశ్‌చంద్రారెడ్డి నియామకం

## ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు ఇస్తూ సర్కార్ ఉత్తర్వులు

**హైదరాబాద్, అక్టోబరు29 (జర్నలిస్ట్‌ఫైల్):** వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రిలో జరిగిన పలు సంఘటనల నేపథ్యంలో ఎంజిఎం సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. ఇప్పుడు ఎంజీఎం హాస్పిటల్‌కి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ హారీష్ చంద్రా రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ పి హారీష్ చంద్రారెడ్డిని ఎంజిఎం ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ మంగళవారం జీవో ఆర్‌టి నంబర్ 506ను జారీ చేశారు. మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వేరే వారికి బాధ్యతలు అప్పగించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డిఎంఈ)ని ఉత్తర్వు లో ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు డాక్టర్ హారీశ్ చంద్రారెడ్డి ఎంజిఎం ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా కొనసాగుతారని ఇప్పటివరకు ఎఫ్‌ఏసి బాధ్యతల్లో ఉన్న డాక్టర్ కె కిషోర్‌కుమార్ ఆ బాధ్యతల నుంచి తొలగించాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# ఇంటర్ ప్రైవేటు విద్యార్థుల హాజరు మినహాయింపు ఫీజు తుదిగడువు నవంబరు 17

**హైదరాబాద్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :** మార్చి 2026లో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు కళాశాలల చదువు లేకుండా హాజరయ్యే ప్రైవేట్ అభ్యర్థులకు హాజరు నుండి మినహాయింపు ఇస్తూ ఫీజు చెల్లించడానికి షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ప్రకటించింది. నవంబరు 17 వరకు రూ. 500 ఫీజుతో చెల్లించడానికి అవకాశం కల్పించారు. అపరాధ రుసుం రూ. 200తో నవంబరు 29 వరకు అవకాశం కల్పించినట్టు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి(సీవోఈ) జయప్రద బాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్, హ్యుమానిటీస్ కాంబినేషన్లతో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఫీజు చెల్లించిన వారు మార్చి 2026లో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరు కావడానికి అనర్హులైతే, ఒకసారి చెల్లించిన రుసుము తిరిగి చెల్లించబడదని స్పష్టం చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి, దివ్య.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 256

**హైదరాబాద్ (బేగంపేట) అక్టోబరు29(జర్నలిస్ట్ ఫైల్) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 256 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 71 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 37 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 83 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 1 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.

# జాబ్ మేళాలతో 23,650 మందికి ఉద్యోగాలు

## సింగరేణి సిఎండి బలరాం

**హైదరాబాద్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి సామాజిక బాధ్యత కార్యక్రమా ల్లో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ సిఎండి ఎన్ బలరాం తెలిపారు. ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు 7 పట్టణాల్లో నిర్వహించిన భారీ జాబ్ మేళా కార్యక్రమాల్లో 66,965 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా, వీరిలో 23,650 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల యువత ముంగిటకే హైదరాబాద్లోని ప్రముఖ కంపెనీలను తీసుకువచ్చి, వారి అర్హతలకు తగిన ఉద్యోగాలను ఎంచుకునే అరుదైన అవకాశాన్ని సింగరేణి కల్పిస్తోందన్నారు. నిరుద్యోగుల ముఖాలపై వెలుగులు నింపుతూ, సింగరేణి గత ఆరు నెలలుగా మెగా ఉద్యోగ మేళాల రూపంలో ఒక బృహత్తర యజ్ఞాన్ని నిర్విరామంగా కొనసాగిస్తోందని చెప్పారు. ఇంత భారీ ఎత్తున జాబ్ మేళాలు నిర్వహించడం, పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడం బహుశా ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఏడవ తరగతి మొదలు పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు గల వారితో పాటు, టెక్నికల్, మెడికల్, పారామెడికల్ తదితర అన్ని విద్యార్హతలు గల వారికి అర్హతలకు తగిన ఉద్యోగాన్ని ఎంచుకునే అవకాశం దక్కిందన్నారు హైదరాబాద్ ప్రాంతం నుండి ఒక్కొక్క జాబ్ మేళా కార్యక్రమంలో 100 నుండి 250 వరకు పలు ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు పాల్గొని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయని వివరించారు.

ఈ జాబ్ మేళా కార్యక్రమాలను ఏప్రిల్ 21న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర నుంచి ప్రారంభించారని, అప్పటి నుండి అది నిర్విఘ్నంగా కొననసాగుతోదని వెల్లడించారు. సింగరేణి సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా మధిరతో పాటు, వివిధ తేదీల్లో భూపాలపల్లి, గోదావరిఖని, వైరా. హుజూర్‌నగర్, సత్తుపల్లి, బెల్లంపల్లిలో ఈ భారీ మెగా జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. సింగరేణి సంస్థ భవిష్యత్తులో కూడా సింగరేణి ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో నిర్వహించే సామాజిక బాధ్యత కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఉద్యోగ మేళాలకు సంస్థ సంపూర్ణ సహకారం అందించనుందన్నారు, త ద్వారా స్థానిక యువతకు, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి సింగరేణి తన వంతు సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

త్వరలోనే కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు, ఆసిఫాబాద్ తదితర ప్రాంతాల్లో మెగా ఉద్యోగ మేళాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

# కమనీయంగా ఉద్దాల మహోత్సవం

## ఉత్సవానికి పోటెత్తిన భక్తజనం

## స్వామివారి పాదుకలను తాకేందుకు బారులు తీరిన భక్తులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు29(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రతి రూపమైన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ కొండల్లోని కాంచనగుహలో స్వ యంభూగా వెలసి పేదల తిరుపతిగా పేరు గాంచిన కురుమూర్తి స్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగు తున్నాయి. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన ఉద్దాల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వడ్డేమాన్ లోని ఉద్దాల కర్మాగారంలో దళితులు నియమనిష్ఠలతో కురు మర్తి స్వామి, పద్మావతి అమ్మవార్ల పాదుకలను తయారు చేశారు. పల్లమర్రి లోని మేదరులు తయారు చేసిన చాట ఉద్దాల మండపానికి రాగానే స్వామివారి పాదుకలను చాటలో ఉంచి ఉద్దాల మండపం ముందు ఉంచారు. అక్కడ నెల్లి వంశీయులు తొలి పూజ చేయగానే స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర చైర్ పర్సన్ సీత దయాకర్ రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువ జన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సతీ మణి వాకిటి లలితమ్మ, దేవస్థానం చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి పాదుకలు ఉన్న చాటను తలపై ఉంచుకునేందుకు ఒకరినొకరు పోటీపడ్డారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారి పాదుకలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అందంగా అలంకరించిన ట్రాక్టర్ పై స్వామి వార్ల పాదుకలను ఉంచి ఊరేంపుగా ఉద్దాల గుండుకు చేర్చారు. అక్కడ వేలాదిగా తరలివచ్చిన భక్తజనం శివసతుల నాట్యాలు, భక్తుల గోవింద నామస్మరణతో కురుమతి గిరులు పులకరించాయి. కొండ దిగువన జాతర మైదానంలో స్వామివారి పాదుకలను ఉంచిన ట్రాక్టర్ మూడు ప్రదక్షి ణలు నిర్వహిం చారు. అనంతరం కొండపై గల స్వామివారి ఆలయానికి చేర్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉద్దాల మండపంలో స్వామివారి పాదుకలను ఉంచి భక్తులకు దర్శనం ఇచ్చారు.స్థానిక శాసన సభ్యులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక,డైరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువ జన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

## టిఎన్‌జిఒ సెంట్రల్ అసోసియేషన్ కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టిఎన్‌జీవో సెంట్రల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం గత 22 నెలలుగా ఎదురు చూస్తూ అనేక పర్యాయాలు ముఖ్యమంత్రితో, మంత్రివర్గ ఉపసంఘంతో, అధికారుల కమిటీతో చర్చలు జరిపినప్పటికీ ముఖ్యమంత్రి, మంత్రులు స్పష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ ఉద్యోగుల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉండటం శోచనీయమని సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ఎస్.ఏం హుస్సేని ముజీబ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో కేంద్ర సంఘం భవనంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘం నేతలు తమ అస హనాన్ని ప్రదర్శించారు. కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, కోశాధికారి ముత్యాల సత్యనారాయణ గౌడ్, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం పెండింగ్ బిల్లులు నెలకు రూ. 700 కోట్లు ఉద్యోగ లోకానికి చెల్లిస్తామని చెప్పినప్పటికీ బకాయిలు ఇప్పటివరకు చెల్లించకుండా తాత్సర్యం చేస్తున్న ఉద్యోగుల గోడును పెడచెవిన పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈహెచ్ఎస్ ఉద్యోగుల ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తామని చెప్పి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కమిటీతోనే పథకాన్ని ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు.

బకాయిపడ్డ 5 డిఏల గురించి అడిగితే కేవలం ఒక్క డిఏ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడం దారుణ మన్నారు. జూలై 1, 2023 నుండి అమలు చేయాల్సి న నూతన వేతన సవరణ మాట ఎత్తకపోవడం, ముఖ్యమంత్రి, యావత్ మంత్రిమండలి సభ్యుల ఆదేశాలను గౌరవించాల్సి న అధికారులందరూ ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారా అనే అనుమానం కలగకుండా ఉండాలంటే, సమస్య లను వెంటనే పరిష్కరించాలని మారం జగదీ శ్వర్, ముజీబ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ బిల్లులను యుద్ధప్రాతిపదికన క్లియర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలను తక్షణమే విడుదల చేయాలి, ఆరోగ్య రక్షణ పథకాన్ని (ఈహెచ్ఎస్) పూర్తి స్థాయిలో అమలుచేయాలన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పీఆర్సీ నివేది కను వెంటనే తెప్పించుకుని 51శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలన్నారు.

వివిధకారణాలతో సస్పెండ్ అయిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టీఎన్జీవోలకు కేటాయించాలన్నారు. జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పదోన్నతుల కమి టీలను సకాలంలో ఏర్పాటు చేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు.

# ఆభరణాల తయారీపై బిఐఎస్ అధికారుల శిక్షణ

**జర్నలిస్ట్‌ఫైల్ ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు29:** భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా, హాల్‌మార్క్ పద్ధతులు పాటిస్తూ బంగారు, వెండి ఆభరణాలు తయారు చేయాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, దక్షిణ ప్రాంత కార్యాలయ హాల్‌మార్కింగ్ అధికారి, డైరెక్టర్ బాలకృష్ణన్ కోరారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఆభరణాల తయారీదారులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం. బాలకృష్ణన్, సైంటిస్ట్-ఇ అండ్ డైరెక్టర్ (హాల్‌మార్కింగ్ అధికారి–ఎస్ఆర్ఓ), టీ. సుజాత, సైంటిస్ట్- ఇ అండ్ డైరెక్టర్, ప్రశాంతి, హెచ్ఎంఆర్, బిఐఎస్ హైదరాబాద్ పాల్గొని బంగారం, వెండి పరీక్షలు, భారతీయ ప్రమాణాల ప్రకారం ఆభరణాల తయారీ విధానం పై శిక్షణనిచ్చారు. పరీక్షలపై లైవ్ డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసిన పాల్గొనేవారికి సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సర్టిఫికేషన్ శిక్షణా కార్యక్రమం ద్వారా ఆభరణాల తయారీలో పాటించాల్సి న ప్రమాణాలు, చేయకూడని పద్ధతులపై స్పష్టత పొందారు. నిజామాబాద్ జిల్లా హాల్‌మార్కింగ్ తప్పనిసరి జిల్లాగా ఉండడంతో, ఈ శిక్షణ తయారీదారులకు హాల్‌మార్కింగ్ ఆభరణాల తయారీలో దోహదపడనుంది. జిల్లాలో వినియోగదారులు హాల్‌మార్క్ ఉన్న ఆభరణాలనే కొనుగోలు చేయాలని, హెచ్‌యుఐడి నంబర్‌ను బిఐఎస్ సిఏఆర్ఈ యాప్‌లో తనిఖీ చేయడం ద్వారా శుద్ధతను నిర్ధారించుకోవాలని సూచించారు.

# సిపిగెట్-2025 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

## నవంబరు 1 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం

**హైదరాబాద్, అక్టోబరు29(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్(పిజి) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలు(సిపిజెట్)-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మా గాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాల క్యాంపస్, కాన్‌స్టిట్యూషనల్, అనుబంధ కళాశాలల క్యాంపస్‌లలో పిజి కోర్సులలో ప్రవేశాల కోసం సిపిజిఈటి-2025ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా నేటి నుంచి నవంబరు 1 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 2న అభ్యర్థులు తమ దరఖాస్తులో తప్పులను సరి చేసుకోవడానికి అవకాశం కల్పించారు. నవంబరు 2 నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. నవంబరు 5నన వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు. వెబ్ ఆప్షన్లుఇచ్చిన వారికి నవంబరు 9న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన వారు నవంబరు 11లోగా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ సూచించారు.



పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

## ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, అక్టోబరు 29 (జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి, పత్తి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపుకలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, సిర్పూర్ నియో జకవర్గ శాసనసభ్యుడు పాల్వాయి హారీశ్‌బాబు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్‌రావు, డిసిఎంఎస్ ఛైర్మన్ కుమురం మాంతయ్య, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు సుద్దాల దేవయ్య, కుడ్మెత విశ్వనాథ్‌లతో జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, ప్రాథమిక సహకార, గ్రామీణ అభి వృద్ధి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొను గోలుకు 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులకు మౌలిక వసతులు కల్పించాలని, తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు మాట్లాడుతూ ఈ సంవత్సరం యూరియా కొరత ఉన్నప్పటికీ వ్యవసాయ అధికారులు సమన్వయంతో వ్యవహరించి రైతులకు యూరియా సకాలంలో అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ అధికారి వెంకటి, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలి



మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచలు చేస్తున్న జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

## మొంథా తుఫాన్ సంసిద్ధతపై సమీక్ష నిర్వహించిన దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు29(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రయాణికులకు ఉత్తమ భద్రతను కల్పించే ప్రయత్నాలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మొంథాఖి తుఫాను పరిస్థితిని ఎదుర్కోవడానికి సంసిద్ధత దిశగా రైలు కార్యకలాపాల భద్రత, కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుండి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో పాటు మొత్తం 6 డివిజన్‌లైన సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రాబోయే మొంథా తుఫాన్ దృష్ట్యా అన్ని విభాగాల ప్రధానాధిపతులతోపాటు పాటు ముఖ్యంగా విజయవాడ, గుంటూరు డివిజన్లతో కూడా వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ తుఫానును ఎదుర్కో వడానికి రైల్వేలు తీసుకుంటున్న వివిధ చర్యలను సమీక్షించారు. వివిధ డిపోలలో రుతుపవనాల సంసిద్ధత కోసం చేసిన నిల్వల స్థితిని ఆయన సమీక్షిం చారు. వివిధ ప్రదేశాలలో తగినంత నిల్వలను మోహరించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను మార్గాన్ని నిశితంగా పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్ఎఫ్) బృందాలతో సన్నిహితంగా వ్యవహరించి, ట్రాక్ మరియు రైలు కార్యకలాపాల భద్రతను నిర్ధారించడానికి ఈ విభాగంలో రైల్వే ప్రభావిత ట్యాంకుల స్థానాన్ని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రభావితమయ్యే విభాగాలలో ట్రాక్‌లపై పెట్రోలింగ్ ఉండేలా చూడాలని కూడా ఆయన ఆదేశించారు. వాస్తవ సమయ సమాచారాన్ని పొందడానికి అన్ని వంతెనలు, ప్రదేశాలలో స్టేషనరీ వాచ్‌మెన్‌లను కూడా నియమించాలని తెలిపారు.

**ఎంప్లాయీ ఆఫ్ ది మంత్ అవార్డులను అందజేసిన జీఎం**

జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బందికి 'ఎంప్లాయీ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డుగ్రహీతలలో స్టేషన్ మాస్టర్స్, లోకో పైలట్లు, పాయింట్స్ మ్యాన్, కీ మ్యాన్ వంటి వంటి వివిధ కేటగిరి లకు చెందినవారు ఉన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ అవార్డు గ్రహీతలను అభినందించారు. వారి విధులను అత్యంత అంకితభావంతో నిర్వర్తించడంలో వారి నిబద్ధతను అభినందించారు. ఈ అవా ర్డులు ఇతర ఉద్యోగులను మరింత అప్రమత్తంగా ఉండటానికి మరియు రైలు కార్యకలాపాలలో సురక్షితంగా ఉండేలా నిజాయితీగా పనిచేయడానికి ప్రేరేపిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# మూడోసారి పోటీకి ఇష్టమే

## ట్రంప్ మన్‌కీ బాత్!



**వాషింగ్టన్, అక్టోబరు 29 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అంశంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరంగా అవకాశం లేనప్పటికీ, 2028లో మళ్లీ పోటీ చేసే ఆలోచనను ఆయన తోసిపుచ్చలేదు. తన మాజీ వ్యూహకర్త స్టీవ్ బానన్ చేసిన సూచనపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తూ మీడియాతో మాట్లాడిన ట్రంప్, మూడోసారి పోటీ చేయడాన్ని నేను కచ్చితంగా ఇష్టపడతాను. నాకు మునుపెన్నడూ లేనంత మంచి ఆదరణ ఉందని అన్నారు. అయితే, వెంటనే మాట మార్చుతూ, దాని గురించి నేను నిజంగా ఇంకా ఆలోచించలేదని పేర్కొన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా పనిచేయడానికి వీల్లేదు. పొలిటికో కథనం ప్రకారం, ట్రంప్ సన్నిహితుడైన స్టీవ్ బానన్, ఆయన మూడోసారి పోటీ చేయాలని బలంగా వాదిస్తున్నారు. దీనికోసం ఒక ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందని తన పాడ్‌కాస్ట్‌లో ఇటీవల బానన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో తన తర్వాత రిపబ్లికన్ పార్టీని నడిపించే నాయకులపై కూడా ట్రంప్ స్పష్టత ఇచ్చారు. 2028 అధ్యక్ష ఎన్నికల బరిలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధాన అభ్యర్థులుగా ఉంటారని సంకేతాలిచ్చారు. మన దగ్గర చాలా మంచి నాయకులు ఉన్నారు. వారిలో ఒకరు ఇక్కడే నిలబడి ఉన్నారంటూ రూబియోను ఉద్దేశించి అన్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా అద్భుతమైన వ్యక్తి. వీరిద్దరికీ వ్యతిరేకంగా ఎవరూ పోటీ చేయరని నేను భావిస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ట్రంప్ ఆసియా పర్యటనలో ఉన్నారు. మలేషియాలో ఆసియాన్ సదస్సులో పాల్గొన్న ఆయన, తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని జపాన్‌లోని టోక్యోకు చేరుకున్నారు. మలేషియా పర్యటన ముగింపు సందర్భంగా అక్కడి అధికారులు, ప్రజలకు ఆయన అభివాదం చేశారు. చాలా గొప్ప, శక్తివంతమైన దేశం మలేషియా నుంచి బయలుదేరుతున్నాను. కీలకమైన వాణిజ్య, రేర్ ఎర్త్ ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అంతకుమించి థాయ్‌లాండ్, కంబోడియా మధ్య శాంతి ఒప్పందం కుదిర్చాం. ఇక యుద్ధం లేదు లక్షలాది ప్రాణాలను కాపాడాం. ఇప్పుడు జపాన్‌కు బయలుదేరానని ఆయన ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ చేశారు.

## రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు!



**చెన్నై, అక్టోబరు 29 :** ప్రముఖ తమిళ నటుల ఇళ్లకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, వర్ధమాన నటుడు ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈమేరకు తైనాంపేట్ పోలీసులకు ఈమెయిళ్లు అందడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఏకంగా రాష్ట్ర డిజిపి కార్యాలయానికే ఈ మెయిళ్లు రావడం విశేషం. ఈ నటుల ఇద్దరి ఇళ్లు కూడా తైనాంపేట్‌పోలీసు పరిధిలో ఉండటంతో వెంటనే కేసులునమోదుచేసి గాలింపు ప్రారంభించారు. అయితే ఇళ్లకువెళ్లిన తర్వాత తమకు బాంబు స్క్వాడ్ అవసరం ఏమీ లేదని చెప్పారని తేలింది. రెండో హెచ్చరిక సాయంత్రం 6.30 గంటలకు వచ్చింది. రజనీకాంత్ టీమ్ మరోసారి సెక్యూరిటీ తనిఖీలను వ్యతిరేకించింది. అలాగే మరోనటుడు ధనుష్‌ఇంటిని పేల్చేస్తామని కూడా ఇదే తరహా మెయిల్ డిజిపికి వచ్చింది. ఆయన కూడా ఇలాంటి సెక్యూరిటీ తనిఖీలు వద్దని నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవలికాలంలోప్రముఖ వ్యక్తులు అనేకమందికి ఈ తరహా మెయిళ్లు వస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సైబర్‌క్రైమ్ పోలీసులు ఈ వచ్చిన ఈమెయిళ్లను పరిశీలిస్తున్నారు. ఎక్కడినుంచి వచ్చాయన్న వివరాలన ఐపి అడ్రసులను ట్రాకింగ్‌చేస్తున్నట్లు తెలిపారు.

## రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధం

### ఘటనలో ముగ్గురు మృతి, పలువురికి గాయాలు



**జైపూర్, అక్టోబరు 29 :** కర్నూలులో ఘోర బస్సు ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 19 మంది సజీవదహనమయ్యారు. ఈ ఘటన మరువకముందే దేశంలో మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధమైంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. జైపూర్, ఢిల్లీ, జాతీయ రహదారిపై మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఉత్తరప్రదేశ్ నుంచి తోడిలోని ఇటుక బట్టీకి కార్మికులను తీసుకెళుతోంది. జైపూర్ గ్రామీణ జిల్లా షాపురా సబ్ డివిజన్‌లోని మనోహర్‌పూర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. బస్సు రన్నింగ్‌లో ఉండగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలాయి. వెంటనే భారీ శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందారు. సుమారు 12 మంది గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు మొత్తం దగ్ధమైంది. సమాచారం అందున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## ట్రంప్‌ను 'శాంతి'కి నామినేట్ చేస్తా

**- జపాన్ ప్రధాన మంత్రి సనాయి తకైచి - టోక్యోలో ట్రంప్‌తో చర్చలు**



**టోక్యో, అక్టోబరు 29 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ చేస్తానని జపాన్ ప్రధానమంత్రి సనాయి తకైచి పేర్కొన్నారు. ఇదే విషయాన్ని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. మంగళవారం ఉదయం టోక్యోలోని అకసకా ప్యాలెస్‌లో ప్రధానమంత్రి తకైచితో ట్రంప్ భేటీ అయ్యారు. ఇరు దేశాల ఆర్థిక, భద్రతా, ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ఈ భేటీ సందర్భంగా, నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ నామినేషన్‌కు తాము మద్దతిస్తామని తకైచీ స్పష్టం చేసినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. అయితే, దీనిపై జపాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ సమావేశంలో అంతర్జాతీయ శాంతి స్థాపన కోసం ట్రంప్ చేస్తున్న కృషిని తకైచీ కొనియాడారు. ముఖ్యంగా థాయ్‌లాండ్- కంబోడియా మధ్య శాంతి ఒప్పందం, గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించారని ఆమె ప్రశంసించారు. "అధ్యక్షా, మీరు థాయ్‌లాండ్, కంబోడియా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని సాధించడంలో విజయం సాధించారు.

అలాగే, మధ్యప్రాచ్యంలో మీరు ఇటీవల కుదిర్చిన ఒప్పందం అపూర్వమైనది, చారిత్రాత్మకమైనది" అని తకైచీ అన్నారు. ఆసియాలో అమెరికాకు జపాన్ అత్యంత విశ్వసనీయ మిత్రదేశంగా ఉంది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ మూలకాలపై ఒప్పందాలు జరిగాయి. ఆసియా పర్యటనలో భాగంగా ట్రంప్ తొలుత మలేషియాలో పర్యటించి ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు.

# సరిహద్దులు మళ్లీ ఉద్రిక్తం



**లీపా లోయలో కాల్పుల విరమణ ఉల్లంఘన మోర్టార్ షెల్లింగ్‌కు తెగబడిన పాక్ రేంజర్లు**

**శ్రీనగర్, అక్టోబరు 29 :** భారత్, పాకిస్తాన్‌ల మధ్య నియంత్రణ రేఖ వెంబడి దాదాపు 5 నెలలుగా నెలకొన్న ప్రశాంతతకు మరోసారి భంగం కలిగింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ ఏడాది మే 10వ తేదీ నుంచి నిశ్శబ్దంగా ఉన్న సరిహద్దు ప్రాంతం తాజాగా అక్టోబర్ 26,27 మధ్య అర్ధరాత్రి కాల్పుల మోతతో దద్దరిల్లింది. నియంత్రణ రేఖ వెంబడి జమ్మూ కాశ్మీర్‌లోని వ్యూహాత్మక ప్రాంతమైన లీపా లోయలో పాకిస్తాన్ సైన్యం ఈ కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడింది. సరిహద్దుల్లోని భారత స్థావరాలను లక్ష్యంగా చేసుకొని పాక్ సైనికులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరపడంతో పాటు మోర్టార్ షెల్లింగ్‌కు కూడా తెగబడినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చాలా కాలంగా లీపా లోయ వద్ద పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి అక్రమంగా చొరబాట్లకు కీలకమైన స్థావరంగా ఉంది. పాకిస్తాన్ సైన్యం ప్రారంభించిన దుశ్చర్యకు భారత సైనికులు గట్టిగా బదులిచ్చారు. పాక్ రేంజర్ల రెచ్చగొట్టే కాల్పులను భారత సైనికులు బలంగా తిప్పికొట్టారు. భారత జవాన్ల దీటైన ప్రతిఘటనతో పాకిస్తాన్ సైనికులు తోక ముడిచి వెనక్కి తగ్గక తప్పలేదని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. భారత్ బ్రహ్మోస్ మిసైల్స్‌కు పాక్ సైన్యం అవాక్కైంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి నియంత్రణ రేఖ వెంట మే 10వ తేదీ నుంచి శాంతి యుత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు మరణించిన తర్వాత ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ మే 7వ తేదీన చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో పాకిస్తాన్ భూభాగంలో లోపల ఉన్న 9 ఉగ్రవాద శిబిరాలను భారత వైమానిక దళం ధ్వంసం చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఆపరేషన్ సిందూర్‌లో వందకు పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్ర సంస్థల స్థావరాలు పూర్తిగా నాశనం అయ్యాయి. కూలిన పాక్ ఫైటర్ జెట్లు ఆపరేషన్ సిందూర్ దెబ్బకు తట్టుకోలేకపోయిన పాకిస్తాన్ భారత్‌పై డ్రోన్, క్షిపణి దాడులకు దిగింది. అయినప్పటికీ భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లు ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఫలితంగా.. మే 8వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పాకిస్తాన్‌లోని 11 సైనిక విమాన స్థావరాలపై దాడులు చేయడంతో.. తీవ్రంగా వణికిపోయిన ఇస్లామాబాద్ చివరకు కాల్పుల విరమణ కోసం భారత్‌కు విజ్ఞప్తి చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ స్వయంగా శాంతి కోసం భారత్‌ను అభ్యర్థించిన తర్వాత కూడా తాజాగా లీపా వ్యాలీలో కాల్పుల విరమణను ఉల్లంఘించడం ఆ దేశం వక్రబుద్ధికి, సరిహద్దుల్లో శాంతిని చెదరగొట్టాలనే కుట్రకు నిదర్శనంగా నిలుస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఆగస్టులో పూంఛ్ ప్రాంతంలో కూడా ఇలాంటి ఉల్లంఘనలు జరిగాయని వార్తలు వచ్చినా అప్పట్లో భారత సైన్యం వాటిని ఖండించింది. అయితే తాజా లీపా వ్యాలీ ఘటనతో సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తత పెరిగింది.

# ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

**• 200 యూనిట్ల ఉచిత విద్యుత్ • మహిళలకు ప్రతినెలా రూ.2,500 • ప్రభుత్వం వచ్చిన 20రోజుల్లోనే అమలు**

**• 25 హామీలతో మహాకూటమి మేనిఫెస్టో విడుదల**



**పాట్నా, అక్టోబరు 29 :** బీహార్‌లోని ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమి రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం మంగళవారం తన ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక సహాయం హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలనెలా రూ.2,500 ఆర్థిక సహాయం ఇస్తామని పేర్కొంది. అలాగే పాత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని కూడా మేనిఫెస్టోలో మహా కూటమి హామీ ఇచ్చింది. జీవికా దీదీస్‌కు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని కూడా మేనిఫెస్టోలో పేర్కొంది. కాంట్రాక్టు, ఔట్ సోర్స్ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులు మారుస్తామని హామీనిచ్చింది. దాదాపు 25 హామీలతో "బీహార్ కా తేజస్వి ప్రాణ్ పత్ర" పేరిట మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహాఘట్ బంధన్ సిఎం అభ్యర్థి, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, డిప్యూటీ సిఎం అభ్యర్థి, వికాస్‌శీల్ ఇసాన్ పార్టీ (విఐపి) చీఫ్ ముకేష్ సాహని, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా, సిపిఐ(ఎంఎల్) అగ్రనేత దీపాంకర్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, తమ మేనిఫెస్టోలో ఆచరణాత్మక హామీలనే తాము పెట్టామని, ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి భారం కాదని పేర్కొన్నారు. అధికార ఎన్‌డిఏ కూటమిపై తేజస్వి విమర్శలు గుప్పించారు. సిఎం నితీశ్‌కుమార్ ఎన్‌డిఏ కూటమిలో బందీ అయిపోయారని, అందుకే సిఎం అభ్యర్థి ఎవరనేది ఇంకా తేల్చడం లేదని ఆర్‌జెడి నేత దుయ్యబట్టారు.

**చిక్కుల్లో ప్రశాంత్ కిశోర్ - బీహార్, బెంగాల్‌లో ఓటరుగా నమోదు - ఇసి నోటీసులు**

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ చిక్కుల్లో పడ్డారు. బీహార్‌తోపాటు పశ్చిమబెంగాల్ రెండు రాష్ట్రాల ఓటర్ల జాబితాలో ప్రశాంత్ కిశోర్ పేరు నమోదైంది. బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భబానీపూర్‌లో 121, కాళీఘాట్ రోడ్ చిరునామాతో ఓటరు జాబితాలో ప్రశాంత్ కుమార్ పేరుంది. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కిశోర్ టిఎంసికి రాజకీయ సలహాదారుగా పనిచేసిన విషయం తెలిసిందే. బీహార్‌లో కర్గాహర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ప్రశాంత్ కిశోర్‌కు ఓటుంది. పికెకు ఇసి నోటీసులు బీహార్‌తో పాటు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలోనూ ఆయన పేరు కనిపించడంతో ఎన్నికల కమిషన్ ఈ చర్యలకు దిగింది. బీహార్‌లో రోహతాస్ జిల్లా ససరాంలోని కర్గాహర్ అసెంబ్లీ నియోజవవర్గం రిటర్నింగ్ అధికారి ఈ నోటీసులు పంపారు. కర్గాహర్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 621లో ఎపిక్ (ఓటర్ ఐడి) నంబర్ 1013123718 కింద ఓటరుగా ఆయన పేరు నమోదైందని, ఇదే సమయంలో పశ్చిమబెంగాల్‌లోని భాబనీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సెయింట్ హెలెన్ స్కూలు పోలింగ్ బూత్‌లో కూడా ఆయన పేరు నమోదై ఉందని ఆ నోటీసులో రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.





## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బస్సుదగ్ధం!

**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ మధ్యాహ్నం పెను ప్రమాదం తప్పింది. టెర్మినల్ 3 వద్ద ఎయిరిండియా విమానానికి కొన్ని మీటర్ల దూరంలో ఆగి ఉన్న ఓ బస్సులో అగ్నిప్రమాదం సంభవించింది. బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. టెర్మినల్ 3 వద్ద బే 32 సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సు పలు విమానయాన సంస్థలకు గ్రౌండ్ సర్వీసులు అందించే సాట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే థర్డ్‌పార్టీ సంస్థకు చెందినది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరు. సమాచారం అందుకున్న వెంటనే విమానాశ్రయ అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి, నిమిషాల వ్యవధిలోనే మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ యాజమాన్యం స్పందించింది. ఇదొక సాధారణ ఘటనేనని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎక్స్ వేదికగా తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే మా ప్రథమ ప్రాధాన్యత. విమాన సర్వీసులన్నీ యథాతథంగా కొనసాగుతున్నాయి" అని స్పష్టం చేసింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు గానీ, లగేజీ గానీ లేదని పోలీసులు తెలిపారు. అయితే, బస్సులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడని, అతనికి ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సాట్స్ సంస్థ దర్యాప్తు ప్రారంభించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రమాద కారణాలను తెలుసుకునేందుకు బస్సును క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## రీల్స్ చేయబోయి నదిలోపడిన బిజెపి ఎమ్మెల్యే



**న్యూఢిల్లీ, అక్టోబరు 29 :** దేశరాజధాని ఢిల్లీలో అధికార బీజేపీకి చెందిన ఓ ఎమ్మెల్యేకి ప్రమాదకర అనుభవం ఎదురైంది. యమునా నది శుభ్రతపై రీల్స్ చేస్తూ కాలుజారి నదిలో పడిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఛట్ పూజ వేడుకల నేపథ్యంలో యమునా నది శుభ్రతపై అధికార బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. తాము అధికారం చేపట్టిన తర్వాత యమునా శుభ్రమైందంటూ బీజేపీ ప్రచారం చేస్తోంది. అయితే, బీజేపీ ప్రచారాన్ని ఆప్ తిప్పికొడుతోంది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో యమునా నది శుభ్రతపై అవగాహన కల్పించేందుకు పత్పర్‌గంజ్ బీజేపీ ఎమ్మెల్యే రవీందర్ సింగ్ నేగి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగానే నది ఒడ్డున రీల్ చిత్రీకరిస్తుండగా.. అదుపుతప్పి నదిలోకి పడిపోయారు. 19 సెకన్ల నిడివి ఉన్న ఆ వీడియోలో, ఎమ్మెల్యే నేగి రెండు బాటిళ్లను చేతిలో పట్టుకుని యమునా నది ఒడ్డున మోకాళ్లపై కూర్చుని ఉంటారు. అక్కడి నుంచి లేవడానికి ప్రయత్నించగా అదుపుతప్పి ఒక్కసారిగా నీటిలో పడిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై ఆప్ నేత సంజీవ్ ఝా తీవ్రంగా స్పందిస్తూవ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీజేపీ నాయకులకు తప్పుడు వాగ్దానాలు చేయడం ఓ వృత్తిగా మారిందంటూ వ్యాఖ్యానించారు. బహుశా అబద్ధాలు, ప్రచార రాజకీయాలతో విసిగిపోయిన యమునా స్వయంగా వారిని పిలిపించుకున్నట్టుంది అన్నారు.

## అమెరికా, రష్యా మధ్య ప్లుటోనియం ఒప్పందం రద్దుచేసిన పుతిన్

**మాస్కో, అక్టోబరు 29 :** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ గట్టి షాకిచ్చారు. ఉక్రెయిన్ తో యుద్ధాన్ని ఆపేయాలన్న తన సూచనను పెడచెవిన పెట్టాడని పుతిన్ పై ట్రంప్ ఇప్పటికే ఆగ్రహంగా ఉ న్నారు. ఈ క్రమంలోనే అమెరికాతో గతంలో రష్యా కుదుర్చుకున్న ప్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారు. దీనికి సంబంధించిన చట్టంపై తాజాగా పుతిన్ సంతకం చేశారు. ఈ పరిణామం మళ్లీ అణు ఉద్రిక్తతలకు దారి తీస్తుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒబామా హయాం లోనే2000 సంవత్సరంలో అమెరికా, రష్యాల మధ్య ప్లుటోనియం నిర్వహణపై ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2010లో ఈ ఒప్పందాన్ని సవరించారు. దీని ప్రకారం రష్యా తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ప్లుటోనియంను అణ్వాయుధాల తయారీకి వాడకూడదు. ఈ నిల్వలను పౌర అణు విద్యుత్ తయారీ కోసం వినియోగించుకోవాలని ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారీని అడ్డుకున్నట్లు అప్పట్లో అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒబామా హయాంలో 2016 సంవత్సరం అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. దీంతో ప్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు.

# సంక్షిప్తంగా..

## తుర్కియేలో తీవ్రస్థాయి భూకంపం



**అంకారా, అక్టోబరు 29 :** తుర్కియేలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. నేటి వేకువజామున దేశంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా భూమి కంపించడంతో ఉలిక్కిపడి లేచారు. ఏం జరుగుతోందో తెలియని ఆందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప కేంద్రం, ప్రభావితమైన ప్రాంతాల పూర్తి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం అందనప్పటికీ, కొన్ని భవనాలకు స్వల్ప నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. భూకంపం సంభవించిన వెంటనే అప్రమత్తమైన అధికార యంత్రాంగం సహాయక చర్యలను ప్రారంభించింది.

## ఆర్ఎస్ఎస్‌పై కర్ణాటక సర్కార్‌కు హైకోర్టు షాక్

**బెంగళూరు, అక్టోబరు 29 :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది.

## దుబాయ్‌లో ఎన్ఆర్ఐల కోసం పాస్‌పోర్టు సేవా ప్రోగ్రామ్

**దుబాయ్,అక్టోబరు 29 :** ఎన్ఆర్ఐల కోసం దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్.. పాస్‌పోర్టు సేవా ప్రోగ్రామ్ 2.0ను ఆవిష్కరించింది. ఆధునికీకరించిన ఈ ప్రోగ్రామ్ మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. పాస్‌పోర్టు సేవలను రిజిస్టర్ చేసుకోవడానికి, దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తుదారులు కొత్తగా లాంచ్ అయిన ఆన్‌లైన్ పోర్టల్‌ను వినియోగించాల్సి ఉంటుంది. అప్లికేషన్ ప్రాసెస్, సర్వీస్ సెంటర్లలో ఎదురుచూపులు తగ్గించేందుకు ఈ సేవను అందుబాటులోకి తీసుకువచ్చారు. పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0 కింద ఇ-పాస్‌పోర్టులను తీసుకువచ్చారు. ఈ సాంకేతికతతో ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌లు వేగవంతం కానున్నాయి. భారత్ అందించే సేవలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మారనున్నాయి. వీసా అవసరాలకు తగ్గట్టుగా ఫొటో, సంతకం, ఇతర పత్రాలను నేరుగా ఆ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేసుకోవచ్చు. దాంతో బిఎల్ఎస్ ఇంటర్నేషనల్ సెంటర్లలో ప్రాసెసింగ్ టైమ్ తగ్గే అవకాశం ఉంటుంది.

## కెనడాలో సిక్కునేత దారుణ హత్య

**టొరంటో, అక్టోబరు 29 :** కెనడాలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కానమ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు దర్శన్ సింగ్ సాహ్సి (68) కాల్పుల్లో మరణించారు. బ్రిటిష్ కొలంబియాలోని అబాట్స్‌ఫోర్డ్‌లో ఆయన నివాసం వెలుపల ఈ ఘటన జరిగింది. కారులో కూర్చుంటున్న సమయంలో ఓ దుండగుడు ఆయనపై కాల్పులు జరిపి పారిపోయినట్లు తెలుస్తోంది. అబాట్స్‌ఫోర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 9:22 గంటలకు రిడ్జ్‌వ్యూ డ్రైవ్‌లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి, కారులో ఉన్న సాహ్సి తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ప్రథమ చికిత్స సిబ్బంది వెంటనే వైద్య సహాయం అందించినప్పటికీ ఫలితం లేకపోయింది.

## ఢిల్లీ బయట రిజిస్ట్రేషన్ వాహనాలకు ఇకపై నో ఎంట్రీ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 29 :** దేశ రాజధాని ఢిల్లీ లోకి నగరం బయట రిజిస్టర్ అయిన కమర్షియల్ వాహనాల ప్రవేశంపై నిషేధం విధించారు. నవంబర్ 1 నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుందని అధికారులు తెలిపారు. 'ది కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే బీఎస్6 నార్మ్స్ కు లోబడి ఉన్న వాహనాలను మాత్రం ఈ నిషేధం నుంచి మినహాయించారు. బీఎస్6 నార్మ్స్‌కు లోబడి వాహనాలు కాలుష్య కారకాలను తక్కువగా విడుదల చేస్తాయని, కాలుష్య నియంత్రణలో ఇవి తోడ్పడుతాయని అధికారులు చెప్పారు. ప్రమాణాలకు లోబడి బీఎస్6 వాహనాలకు 2026 అక్టోబర్ 31 వరకు మాత్రమే ఢిల్లీలోకి అనుమతి ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్6 కమర్షియల్ వాహనాలతోపాటు సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా తాజా నిషేధథం నుంచి మినహాయింపు ఇచ్చారు.

## తుఫాన్ ను సమర్ధవంతంగా ఎదుర్కొన్నాం



- ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం
- మేయర్, కమిషనర్ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాన్ ను సమర్ధంవతంగా ఎదుర్కొన్నామని, నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు ప్రణాళికాబద్దంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూసామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మేయర్, కమిషనర్ లు రామాంజనేయపేట, ఇన్నర్ రింగ్ రోడ్, శ్రీకృష్ణదేవరాయ నగర్, తుఫాన్ నగర్ లను పరిశీలించి, తుఫాన్ ప్రభావంపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకొని, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తుఫాన్ ని ఎదుర్కోవడానికి జిఎంసి ఆధ్వర్యంలో విస్తృత చర్యలు తీసుకున్నామన్నారు. ప్రధానంగా అధికారులు, సచివాలయ కార్యదర్శులు తమకు కేటాయించిన విధుల్లో నూరు శాతం ఉన్నారని, వారికి తోడ్పాటుగా కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు కూడా నిలిచారన్నారు. పునరావాస కేంద్రాల్లో కూడా ఏ లోపం లేకుండా అన్నిరకాల సదుపాయాలు కల్పించారన్నారు. శివారు ప్రాంతాల అభివృద్ధిపై రానున్న కాలంలో ప్రత్యేక కార్యాచరణ మేరకు కృషి చేస్తామని తెలిపారు.

కమిషనర్ మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ముందస్తుగా కచ్చా డ్రైన్ల ఏర్పాటు, మేజర్ డ్రైన్లలో పూడికతీత చేపట్టడం వలన పలు కాలనీలు ముంపు బారిన పడలేదన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు పంపి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. తుఫాన్ నగర్ లో ప్రజలను పునరావాస కేంద్రాలకు పంపడంతో పాటు సదరు ప్రాంతంలో నిలిచిన నీటిని మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయించామని తెలిపారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా జిఎంసి కమాండ్ కంట్రోల్ రూమ్ 0863 2345103 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. పర్యటనలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డిఈఈ శ్రీనివాస్, నోడల్ అధికారులు, వివిధ డివిజన్ల కార్పోరేటర్లు,అధికాలరు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తెనాలిలో గాయత్రీ కోఆపరేటివ్ సొసైటీ అర్బన్ బ్యాంక్ ప్రారంభం



- తెనాలిశాఖ ప్రారంభించిన డబుల్ హార్స్ అధినేత మునగాల శ్యాం ప్రసాద్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించి ఖాతదారుల నమ్మకంతొ, మరింత పురోభివృద్ధి సాధించాలని డబుల్ హార్స్ సంస్థల అధినేత మునగాల మోహన శ్యాం ప్రసాద్, గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభించిన సందర్భంగా పేర్కొన్నారు.

స్థానిక గంగానమ్మ పేటలోని వ్యాపార కూడళ్ళ నడుమ, ఆవాస కాప్లెక్స్,గ్రౌండ్ ఫ్లోర్ లొ, బుధవారం గాయత్రీ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. డబుల్ హార్స్ సంస్థల అధినేత మునగాల మోహన శ్యాం ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని, గాయత్రి బ్యాంక్ ను ప్రారంభించగా, లాకర్ విభాగాన్ని, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఎటిఎమ్ విభాగాన్ని డాల్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నంబూరు వెంకట కృష్ణమూర్తి ప్రారంభించారు. అతిధులు తమ ప్రసంగాల ద్వార అభినందలు తెలిపారు. గాయత్రి అర్బన్ బ్యాంక్ తెలంగాణ తొ, పాటు, ఆంధ్రాలొ కూడ శాఖలను పెంచుకునె విధానం అభినందనీయమని, మెరుగైన సేవలతొ ఖాతాదారుల నమ్మకాన్ని పెంచుకోవాలని అన్నారు. బ్యాంక్ చైర్మన్ గుండేటి గంగాధర్ మాట్లాడుతు రెండువేల సంవత్సరంలొ, తెలంగాణలొ ప్రారంభమైన గాయత్రి అర్బన్ బ్యాంక్, 26సంవత్సరాలుగా, ఖాతాదారుల నమ్మకంతొ, శాఖలను పెంచుకుంటు, ఆంధ్రప్రదేశ్ లో కూడా, తమ సేవలను కొనసాగిస్తున్నామని అన్నారు. గుంటూరు జిల్లాలొ తెనాలి తొ పాటు, మరో నాలుగు శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తమ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు ఉదయం 10,గంటలనుండి, సాయంత్రం 7వరకు,భోజన విరామం లేకుండా,నిర్విరామ సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలొ, బ్యాంక్ సిబ్బంది, డైరెక్టర్లు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నసీర్ కంటిమీద కునుకు లేకుండా పర్యవేక్షణ

- రాత్రి 11.30 నుంచి పార్టీ కేడర్ తో సమీక్ష
- 2:30 గంటల నుంచి కార్పొరేషన్ కంట్రోల్ రూములోనే..
- తెల్లవారే వరకు నియోజకవర్గ పరిస్థితిపై ఆరా
- ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నియోజకవర్గంలోని ఏ మారుమూల ఎవరికి ఎలాంటి ఇబ్బంది వస్తుందో ? ఏ సమయంలో ఎలాంటి అవసరం వస్తుందో ? అనే ఆలోచన. మోంథా తుపాను ప్రభావంతో ప్రజలకు చిన్న కష్టం కూడా రాకూడదనే తపన. అందుకే గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కునుకులేకుండా ప్రజల కోసం పని చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో మంగళవారం రాత్రి 11:30 గంటలకు స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో కార్పొరేటర్లు, కూటమి నాయకులతో కలిసి సమీక్షించారు. వార్డుల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీశారు. రాత్రి 2 గంటల వరకు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని తుపాను ప్రభావాన్ని పర్యవేక్షించిన ఎమ్మెల్యే నసీర్.. రాత్రి 2:30 గంటల వరకు మునిసిపల్ కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ రూము వద్దకు వెళ్లారు. తెల్లవారే వరకు కంట్రోల్ రూము నుంచే అధికార యంత్రాంగంతో మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో తుపాను ప్రభావంపై ఆరా తీశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం, చెట్లు విరిగిపడటం, పునరావాస కేంద్రాల్లో వసతి సదుపాయాలు, వరద నీటి పారుదల వంటి సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులను అధికార యంత్రాంగంతో సమన్వయం చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చేశారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గిపోయే వరకు ప్రజలకు రక్షణగా నిలుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

**పునరావాస కేంద్రం పరిశీలన**

బుధవారం మధ్యాహ్నం స్థానిక పొన్నూరు రోడ్డులోని పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. తుపాను ప్రభావం తగ్గినప్పటికీ పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ సురక్షితంగా ఇంటికి చేర్చే వరకు వెన్నంటే నిలుస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రంలో భోజన వసతి సదుపాయాలు చక్కగా ఏర్పాటు చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అందించిన సేవలపై ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. తుపానుకు దెబ్బతిన్న ప్రాంతాల్లో తిరిగి యుద్ధప్రాతిపదికన సాధారణ పరిస్థితులు తీసుకొస్తామని వెల్లడించారు. ప్రజల కోసం పని చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికార యంత్రాంగానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి నిరంతర సమీక్ష

- పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలపై అధికారులతో సమన్వయం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుండి తుఫాన్ ప్రభావిత పరిస్థితులు, పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సౌకర్యాల వివరాలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమీక్షించారు. అధికారులు, ఎన్డీయే కూటమి నేతలతో సమన్వయం చేస్తూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మంగళవారం రాత్రి నుండి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వయంగా పర్యవేక్షిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు గళ్ళా మాధవి ఆదేశాలు జారీ చేశారు.

విరిగిన చెట్ల తొలగింపు, విద్యుత్ లోపాల సవరణ, పునరుద్ధరణ పనులు వేగవంతంగా చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆమె సూచించారు. విద్యుత్ సరఫరా నిలిచిన డివిజన్లలో యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగించి, ప్రజలు ఇబ్బందులు పడకుండా 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాలతో గుంటూరు మిర్చి యార్డు, స్థంబాల గరువు పుల్లయ్య మున్సిపల్ హైస్కూల్, చిన్మయ హైస్కూల్‌లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు, ఎన్డీయే కూటమి నేతలు పర్యవేక్షించారు. కేంద్రాల్లో భోజనం, నీరు, ఆరోగ్య సేవలు, ఇతర వసతులను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో కృష్ణానగర్ రైతు బజార్‌లో నీరు నిలిచిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే అధికారులను సంప్రదించి, డస్ట్ వేయించి ప్రజల ఇబ్బందులను నివారించారు. అలాగే పీకల వాగు కట్ట ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలకు పునరావాసం కల్పించి, సచివాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 67 మందికి భోజనం, త్రాగునీరు, వైద్య వసతులు అందేలా చర్యలు చేపట్టారు.

**తుఫాన్ ప్రభావంతో చెట్లు, స్తంభాలు కూలిన ప్రాంతాల్లో వేగంగా చర్యలు**

కొరిటేపాడు కిలారి టవర్స్ వద్ద స్థంభం మీద చెట్టు కూలిన ఘటనలో వెంటనే తొలగింపు చర్యలు చేపట్టారు. 33వ డివిజన్ అశోక్‌నగర్ 4/1లో కారు మీద చెట్టు పడిన ఘటనను అధికారులు పరిశీలించగా, డివిజన్ అధ్యక్షులు పోపురి నరేంద్ర పర్యవేక్షించారు. 28వ డివిజన్ సీతమ్మకాలనీ, పీకల వాగు ప్రాంతంలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెట్లను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోగా, డివిజన్ అధ్యక్షులు తెల్లగొర్ల అప్పారావు యాదవ్ పర్యవేక్షించారు.

మిర్చి యార్డు పునరావాస కేంద్రంలో 29వ డివిజన్ ప్రజల కోసం భోజన ఏర్పాట్లను డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అలాగే 45వ డివిజన్ పీర్‌తోటలో భారీ చెట్టు కూలిన ఘటనలో, అధికారులు వెంటనే చర్యలు తీసుకోగా, డివిజన్ అధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వరరావు మరియు ఎన్డీయే కూటమి నేతలు పర్యవేక్షించారు. ఎస్వీయన్ కాలనీ, శ్రీనివాసరావు పేటలో కూలిన భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గంటల వ్యవధిలోనే తొలగించి, విద్యుత్తును పునరుద్దరించారు

## పక్షవాతం విషయంలో జాగ్రత్త అవసరం

- లలితా హాస్పిటల్ లో పక్షవాతంపై అవగాహన సదస్సు
- పక్షవాతం విషయము ప్రతి నిమిషం విలువైనది



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా, గుంటూరులోని లలితా హాస్పిటల్ ప్రాంగణంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. న్యూరో సైన్సెస్ విభాగాధిపతి, డా. పి. విజయ న్యూరో ఫ్యాకల్టీ– డా. వీరమ్మ, డా. శ్రీనివాసరావు ,డా. రేష్మ , డా. ఉషాకిరణ్ డా. అజ్మా ఆధ్వర్యంలో పక్షవాతం పై అవగాహన సదస్సు నిర్వహించారు.

వరల్డ్ స్ట్రోక్ డే సందేశం "పక్షవాతం విషయంలో ప్రతి నిమిషం విలువైనది" ఎందుకనగా ఇది ఏ వయసులోనైనా, ఎప్పుడైనా సంభవించగల ముఖ్యమైన వ్యాధి. పక్షవాతం ప్రారంభమైన ప్రతి నిమిషానికి సుమారు 20 లక్షల మెదడు కణాలు చనిపోతాయి, అంటే ఒక గంటలో మూడు సంవత్సరాల వయసు పెరిగినంత నష్టం మెదడుకు జరుగుతుంది. కాబట్టి తక్షణ చర్య చాలా అవసరం." అని తెలిపారు.

ఇప్పుడు పక్షవాతానికి నిర్దుష్టమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. గోల్డెన్ అవర్ అయిన మొదటి నాలుగు గంటలన్నరలో రోగిని స్ట్రోక్ రెడీ హాస్పిటల్కి తీసుకువెళ్ళే సి ఐ స్కాన్ చేసి పక్షవాతం రకం నిర్ధారించి, ఒక వేళా క్లాట్ మూలంగా ఇస్కీమిక్ స్ట్రోక్ అయితే ఐవి థ్రోంబోలైటిక్ థెరపీ ద్వారా రక్త గడ్డ కరిగించే మందు ఇచ్చి, సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది" అని చెప్పారు.

గోల్డెన్ అవర్ – నాలుగు గంటలన్నర మాత్రమే, కాబట్టి పక్షవాతం లక్షణాలను వెంటనే గుర్తించి, తక్షణమే %జు% స్కాన్ , న్యూరాలజిస్ట్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉన్న స్ట్రోక్ రెడీ హాస్పిటల్ కి తీసుకెళ్లాలి. ఆలస్యం చేస్తే మెదడు నష్టం పెరిగి, శాశ్వత అంగవైకల్యం సంభవించవచ్చు.

**పక్షవాత నివారణకు**

ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయడం, బీపీ , షుగర్ నియంత్రణలో ఉంచుకోవడం, ధూమపానం, మద్యపానం మానుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, బ్లడ్ కాలెస్ట్రాల్ తగ్గించుకోవడం,, ధ్యానం, యోగ వంటి పద్ధతుల ద్వారా మానసిక వత్తిడిని తగ్గించుకోవడం ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో స్ట్రోక్ సర్వైవర్స్, కేర్ గివర్స్, సాధారణ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యూరోసర్జన్ డా. శ్రీనివాసరావు , సీనియర్ న్యూరాలజిస్ట్ డా. వీరమ్మ , డా. రేష్మ , డా. ఉషాకిరణ్ డా. అజ్మా పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్ పహారా



- గుంటూరు జిల్లా పోలీసుల అప్రమత్తత

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మోంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఏర్పడిన వరద పరిస్థితులను అంచనా వేయడానికి గుంటూరు జిల్లా పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలతో ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. మారుమూల గ్రామాల్లో వాగులు, కాలువలు, చెరువుల నీటి మట్టం పెరుగుదల పరిస్థితులను డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు. గండ్లు పడే లేదా పొంగిపొర్లే అవకాశం ఉన్న ప్రదేశాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు కాలనీలలో డ్రోన్ సర్వే నిర్వహించి ప్రమాద సూచనలపై తక్షణ చర్యలు చేపడుతున్నారు. రోడ్ల పరిస్థితులను పర్యవేక్షించి ట్రాఫిక్ డైవర్షన్‌లు అమలు చేస్తున్నారు. ద్వీప ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు కొనసాగుతున్నాయి. సంబంధిత శాఖలతో సమన్వయంగా రక్షణ చర్యలు వేగవంతం చేస్తున్నారు. ప్రజలు వాగులు, చెరువులు, కాలువల సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, అధికారుల సూచనలను అనుసరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## గుంటూరులో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏక్తా దివస్ సందర్భంగా భారీ ర్యాలీ



- బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కార్యక్రమం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవం సందర్భంగా గుంటూరులో బిజెపి ఆధ్వర్యంలో భారీ ఏక్తా ర్యాలీ శుక్రవారం ఉదయం 8:30 గంటలకు నిర్వహించబడనుంది. ఈ విషయం బిజెపి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మీడియాతో వెల్లడించారు.

ర్యాలీ గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమై నాజ్ సెంటర్ సమీపంలోని ఉమెన్స్ కాలేజీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో బిజెపి శ్రేణులతో పాటు ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇన్చార్జ్ నాగోతు రమేష్ నాయుడు హాజరుకానున్నారని తిరుపతిరావు తెలిపారు. ఈ పత్రికా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, వి. పాండురంగ విట్టల్, వై.వి. సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో లోతట్టు ప్రాంతాలు జలమయం



- తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే చదలవాడ
- రాత్రింబవళ్లు పర్యటనలు
- చదలవాడ పనితీరు భేష్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాను ప్రభావంతో నరసరావుపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రహదారులపై, నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను అప్రమత్తం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

మంగళవారం రాత్రి 12 గంటల వరకు పర్యటించిన ఎమ్మెల్యే, బుధవారం తెల్లవారుజాము 3 గంటల నుంచి మళ్లీ ప్రభావిత ప్రాంతాల్లో స్వయంగా తిరిగారు. పట్టణంలోని సత్తనపల్లి రోడ్డులో చంద్రబాబు నాయుడు కాలనీ వద్ద డ్రైనేజీ కాలువ పొంగిపొర్లింది. గుంటూరు రోడ్డు స్వర్గపురి వద్ద కూడా డ్రైనేజీ కాలువ పొంగి రహదారులపై నీటి ప్రవాహం చేరింది. లోతట్టు ప్రాంతమైన బీసీ కాలనీలో నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ ప్రాంతాలన్నింటినీ ఎమ్మెల్యే స్వయంగా పర్యటించి, సమస్యలను అధికారులతో కలిసి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రతిరోజూ సానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహించడం వల్ల డ్రైనేజీ కాలువలు శుభ్రంగా ఉండటం ఈ తుఫాను సమయంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. తుఫాను వల్ల వచ్చిన వరద ఉధృతి డ్రైనేజీల్లో సజావుగా ప్రవహించి, నివాస ప్రాంతాల్లోకి పొంగి రాకుండా అడ్డుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఇది పెద్ద ఎత్తున నష్టాన్ని తగ్గించింది. అయితే, బీసీ కాలనీ వద్ద, రావిపాడు రోడ్డులో ఈదురుగాలులకు చెట్లు విరిగిపడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు సహకారంతో విరిగిపడిన చెట్లను తొలగించి రవాణాను సాఫీగా చేశారు. ఈ చర్యలకు స్థానిక ప్రజలు ఎమ్మెల్యేని అభినందిస్తున్నారు. తుఫాను ప్రభావం తగ్గినా, ఎమ్మెల్యే అధికారులతో కలిసి నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడటమే తమ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.

## మొంథా తుఫాను వల్ల అప్రమత్తంగా ఉన్న జిల్లా యంత్రాంగం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** తుఫాను వల్ల గుంటూరు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ బుధవారం వెల్లడించారు. తుఫాన్ సమయంలోను,, అనంతర పరిస్థితుల్లోను గుంటూరు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఎంతో చేకచక్యంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఫిరంగిపురం మండలం పొనుగుపాడు వద్ద రహదారిపై నీరు ప్రవాహం ఉండటంతో బేతపూడి వాగు వద్ద, చప్ట వద్ద వాహనాల రాకపోకలను బుధవారం అధికారులు నిలిపివేశారు. గుంటూరు గ్రామీణ మండలం గోర్లవారిపాలెం వద్ద కొండవీటి వాగు నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. తాడికొండ అడ్డ రోడ్ వద్ద కాలువల్లో నీరు రహదారి పైకి రావడంతో అధికారులు ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు.

పెదనందిపాడు మండలం అభినేని గుంట పాలెం వద్ద వం–ష్ం నీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రమాదాలు జరగకుండా బార్కెట్లు ఏర్పాటు చేశారు. మేడికొండూరు మండలం వై.వి.ఆర్.ఎస్.సి కాలనీ వద్ద చప్ట పై వాగు నీరు ప్రవాహంతో రాకపోకలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా.తెనాలి – మంగళగిరి రహదారిలో సోమసుందర పాలెం వద్ద చెట్టు కూలిపోగా తక్షణం తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు

ఆలూరు వద్ద పడిపోయిన చెట్లను తొలగించారు. దుగ్గిరాల మండలం కరకట్ట – వీరలపాలెం , పెద్ద కిందూరు, పెరుకలపూడి గ్రామాల వద్ద రాత్రి కూలిన చెట్లను తక్షణం తొలగించారు. దొప్పలపూడి వద్ద కూలిన చెట్టును వెంటనే తొలగించారు.




విద్యుత్ అంతరాయంతో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. పలు చోట్ల విద్యుత్ సబ్ స్టేషన్ లకు అంతరాయం కలుగగా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

**వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్**

తుఫాన్ అనంతరం ప్రభావిత ప్రాంతాలలో పరిస్థితులను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బుధవారం పరిశీలించారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో పర్యటించారు. ప్రత్తిపాడు వద్ద కొండవీడు లోయ వాగు వద్ద నీటి ప్రవాహం పరిశీలించారు. ప్రత్తిపాడు గ్రామంలో కాలువల పూడికలు తీస్తున్న పనులు పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పెదనందిపాడు మండలం వరగాని గ్రామం వద్ద నక్కలవాగును పరిశీలించి, నక్కలవాగు, మేకలవాగును ట్రాక్టర్ పై దాటుకుంటూ వరగాని, నందిపాడు నల్లవాగు వంతెన వద్దకు జిల్లా కలెక్టర్ చేరుకున్నారు. పెదనందిపాడులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. అచ్చట పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి పంటల మునక, వాటి పరిస్థితుల్ని తెలుసుకున్నారు. ప్రత్తిపాడు వద్ద పత్తి, మిరప పంటలు బాగా దెబ్బతిన్నాయని రైతులు చెప్పారు. పత్తి పంట పూర్తిగా పాడయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. యూరియా లభ్యత తక్కువగా ఉందని తెలిపారు. వర్షాలు కారణంగా పంటలు రక్షించుకునేందుకు అవలంభించాల్సిన పంటల యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు వివరించారు. జిల్లాలో ఐదు వేల క్వింటాళ్ల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. ఆర్ అండ్ బి రహదారి ఆనుకుని ఉన్న కాలువలు సంవత్సరాలుగా పూడికలు తీయకపోవడంతో ఎక్కువ వర్షాలు కురిసేటపుడు పొలాల్లో నీరు ఎక్కువై రహదారులు మీదకు వస్తుందని రైతులు తెలిపారు. నక్కలవాగు, మేకలవాగు పూడిక లోతుగా తీయాలని వారు కోరారు. వాగులు పొంగటం వలన రహదారులపై రాకపోకలు నిలిచిపోతున్నాయని వివరించారు.

ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వరద ప్రభావంను పరిశీలించామన్నారు. నక్కలవాగు, మేకలవాగుల వలన పంట పొలాలు మునగడం జరిగిందన్నారు. నిబంధనల మేరకు రెండు రోజుల్లో పంట నష్ట అంచనాలు తయారు చేయడం జరుగుతుందన్నారు. తుఫాను అనంతర చర్యలు వేగవంతం చేశామని చెప్పారు. పారిశుధ్యం లోపం లేకుండా చూడాలని ఆదేశించామన్నారు. కాజ్ వేల వద్ద నిరంతర పర్యవేక్షణ జరగాలని అన్నారు. విద్యుత్ పునరుద్ధరణ జరుగుతోందని చెప్పారు. రహదారులపై 84 చెట్లు పడిపోయాయని, వాటిని తక్షణం తొలగించే ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని వివరించారు. వసతి గృహాలు, పాఠశాల భవనాలు వర్షానికి బాగా తడిసి ప్రమాదకరంగా ఉండవచ్చని, తడి గోడలు విద్యుత్ ప్రవాహానికి కారణం కావచ్చని, వాటిని జిల్లా విద్యా శాఖ అధికారి, సంక్షేమ శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించి సురక్షితంగా ఉన్నాయని నిర్ధారణ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. జిల్లాలో 153 పునరావాస కేంద్రాలలో తొమ్మిది వేల మంది ఉన్నారని, వారికి నిత్యావసర సరుకుల కిట్లు సిద్ధం చేస్తున్నామని అన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి ఒక వ్యక్తికి వెయ్యి రూపాయలు చొప్పున నగదు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ఒక కుటుంబం నుండి ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది ఉన్నప్పటికీ గరిష్ఠంగా మూడు వేలు మాత్రమే చెల్లించాలని స్పష్టం చేశారు

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు,, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# “ప్రకృతి విపత్తును ఆపలేక పోవచ్చు - ముందస్తు అప్రమత్తతతో నష్టాన్ని నివారించవచ్చు”

○ అహర్నిశలు అప్రమత్తతతో నష్టాన్ని నివారించిన కూటమి ప్రభుత్వం





**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకృతి విపత్తును ఆపలేక పోవచ్చు, కానీ ముందస్తు అప్రమత్తతతో నష్టాన్ని భారీ స్థాయిలో నివారించవచ్చు అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిరూపించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు అప్రమత్తతో ఉంటూ రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకు ఉన్న అధికారులను, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తత చేస్తూ మొంథా తుఫాను ముప్పు నష్టాన్ని సాధ్యమైనంత మేర తగ్గించగలిగారు. మొంథా తుఫానుకు సంబంధించి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు చేసే హెచ్చరికలు, సూచనలు ఆధారంగా కూటమి ప్రభుత్వం సకాలంలో స్పందిస్తూ తగు ముందస్తు భద్రత చర్యలను చేపట్టడం వల్ల భారీ స్థాయిలో ప్రాణ పశు ఆస్తి నష్టాలను నివారించడం జరిగింది.

అల్పపీడన ప్రభావంతో అక్టోబర్ 26వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరుగా కురవాల్సిన వర్షాలు 27వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం గా మారి “మొంథా” తుపానుగా రూపాంతరం చెందింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ చాలా ముందుగా ఈ నెల 17వ తేదీనే ముందా తుఫాను ముప్పును వెల్లడించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రతి జిల్లాకు ఐఏఎస్ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించి తుఫాను ముప్పు నివారణ చర్యలను ముందస్తుగా చేపట్టడం జరిగింది. ముఖ్యమంత్రి నిరంతర సమీక్షలు, సూచనలతో తుపాను వల్ల సంభవించే నష్టాలను తగ్గించే దిశగా అధికార యంత్రాంగం గత మూడు రోజులుగా విధులు నిర్వహిస్తున్నది. రాష్ట్ర మంత్రులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తుఫాను ముప్పు నివారణ చర్యలను పర్యవేక్షించడం జరిగింది.

విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి రాష్ట్ర హోమ్, విపత్తుల శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ ప్రఖర్ జైన్ పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయడంతో పాటు, తాడేపల్లి లోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో 27వ తేదీ నుంచి అన్ని శాఖల అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండే విధులు కేటాయించి, తుపానుకు సంబంధించిన సమాచారాన్ని అన్ని జిల్లాల నుంచి ఎప్పటికప్పుడు సేకరిస్తూ, నష్ట నివారణ దిశగా కూటమి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేసింది.

తుపాను నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల్లో ప్రజలకు అండగా ఉంటూ, సహాయక చర్యలు చేపట్టడానికి శిక్షణ పొందిన ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్ బలగాలను ప్రభుత్వం పంపించింది.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తుపాను, వర్ష ప్రభావిత జిల్లాల్లో ప్రజలకు అవసరమైన వసతి, సౌకర్యాలు కల్పించడానికి అన్ని జిల్లాలకు నిధులను కేటాయిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.

రక్షణ చర్యల్లో భాగంగా వరద ప్రాంత ప్రజల కోసం రాష్ట్రవ్యాప్తం గా 320 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి పునరావాస కేంద్రంలోని ప్రజల కోసం అల్పాహారం, భోజనం త్రాగునీరు, పాలు తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి నిరంతరం ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం జరిగింది. రాకపోకలకు, రవాణా సౌకర్యం ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు రహదారులను క్లియర్ చేసే బృందాలను ఏర్పాటు చేసింది. విద్యుత్ అంతరాయాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించే చర్యలు చేపట్టడం జరిగింది.

ప్రజలకు నిత్యవసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ విధంగా ప్రతి అంశంలోనూ ప్రభుత్వం ఎంతో అప్రమత్తతో ఉండటం వల్ల భారీ స్థాయిలో తుఫాను ముప్పు నష్టాన్ని నివారించడమే కాకుండా ప్రాణ పశు ఆస్తి నష్టాలను సాధ్యమైనంతమే నివారించడం జరిగింది. తుఫాను ముప్పు నష్టాన్ని భారీ స్థాయిలో నివారించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటం ప్రభుత్వం ఘనవిజయంగా అభివర్ణించొచ్చు.

# రాష్ట్రానికి సీఎం చంద్రబాబు నాయకత్వం దేవుడు ఇచ్చిన వరం



○ సీఎం చంద్రబాబు ముందుచూపుతోనే మొంథా తుఫాన్ బారిన పడకుండా పెద్ద నష్టాన్ని ఆపగలిగాం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం దేవుడు ఇచ్చిన వరమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టి, ముందుచూపు వల్లే మొంథా తుఫాన్ బారిన పడకుండా పెద్ద నష్టాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు. ముందుగానే అన్ని విభాగాలను అప్రమత్తం చేయడం, సమన్వయ చర్యలు చేపట్టడం వల్లే ప్రజల ప్రాణాలు కాపాడబడ్డాయని తెలిపారు. ప్రజల ప్రాణాలు కంటే ముఖ్యమైనది ఏదీ లేదు. ఈ తుఫాన్‌లో దేవుడి దయతో, సీఎం చంద్రబాబు జాగ్రత్తలతో రాష్ట్రం పెద్ద విపత్తు నుండి బయటపడింది అని మంత్రి తెలిపారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రజల భద్రత కోసం పగలు రాత్రి తేడా లేకుండా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు గారు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు సురక్షితంగా ఉండడం దైవానుగ్రహం అని తెలిపారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, పంటలకు నష్టం కలగకుండా తక్షణ సాయంతో ముందుకు వస్తామని మంత్రి వెల్లడించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, రవాణా, పంట నష్టాల పునరుద్ధరణపై అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది. ప్రభుత్వం రైతు కోసం, ప్రజల కోసం ఉందనే నమ్మకం ప్రజల హృదయాల్లో నిలవాలి. దేవుడి దయ, ప్రభుత్వ దృఢ సంకల్పం కలిస్తే ఏ విపత్తునైనా తట్టుకోగలం అని మంత్రి అచ్చెన్నాయుడు గారు అన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి గారికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు బుధవారం నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ జస్టిస్ సుబేందుతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కలకత్తా హైకోర్టు నుండి జస్టిస్ సుభేందు ఏపి హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె. చిదంబరం, ఏపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్. ద్వారకానాథ్ రెడ్డి అదనపు అడ్వకేట్ జనరల్ ఇ. సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, పలువురు ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు మరియు హైకోర్టు ఉద్యోగులు, ఏపి లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.


## శ్రీశైలంలో భక్తులకు అన్నప్రసాద వితరణ



○ మొంథా తుఫాన్ ప్రభావంతో వాహన రాకపోకలు నిలిచిపోయిన నేపథ్యంలో దేవస్థానం చర్యలు

**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి శ్రీశైలానికి వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ముందస్తు చర్యలు చేపట్టింది. భక్తుల సౌకర్యార్థం శిఖరేశ్వరం, బస్టాండుల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు బుధవారం ఉదయం శిఖరేశ్వరం వద్ద అన్నప్రసాద పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా వాహన రాకపోకలను నిలిపివేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శిఖరేశ్వరం, బస్టాండుల వద్ద అన్నప్రసాదాలతో పాటు బిస్కెట్ల పంపిణీ కూడా జరుగుతోందని వివరించారు. ఉదయం పులిహోర, ఉప్మాతో పాటు మధ్యాహ్నం సాంబారన్నం, పెరుగన్నం భక్తులకు అందజేస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు అధికారులు సూచించిన మార్గదర్శకాలను పాటించి తమ ప్రయాణాన్ని సురక్షితంగా కొనసాగించాలని ఆయన సూచించారు.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండ చరియలు



**డోర్నాల (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుపాను ప్రభావంతో నల్లమల ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శ్రీశైలం ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి రహదారిపై పడ్డాయి. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. పెద్ద డోర్నాలలోని అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద వాహనాలను శ్రీశైలం వైపునకు వెళ్లకుండా నిలిపివేశారు. వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పడిన రాళ్లను పొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు.

# అజహరుద్దీన్‌కు మంత్రి పదవి..!

○ ఎల్లుండి ప్రమాణ స్వీకారం?

○ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఏఐసీసీ



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** మహమ్మద్ అజహరుద్దీన్ కు మంత్రి పదవి లభించింది. ఎల్లుండి తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ కార్యక్రమం జరగనుంది. అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ జరిగిన ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు.

ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రి వర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెష్ అధిష్ఠానం ముస్లి మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో.. త్వరలో కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల్లో అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది.

# టెట్ పై రివ్యూ పిటిషన్ హామీ పట్ల పిఆర్టియు హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** టెట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పక్షాన రివ్యూ పిటిషన్ వేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీ ఇవ్వడం పట్ల యావత్తు ఉపాధ్యాయ లోకం హర్షాన్ని వ్యక్తం చేస్తుందని పిఆర్టియు ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కోసూరి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొంతకాలంగా ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు కూడా టెట్ వ్రాయాలనే సుప్రీంకోర్టు తీర్పు పట్ల లక్షలాదిమంది ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారని, ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం వద్ద నుండి ఇలాంటి హామీ రావడం నిజంగా అభినందనీయమన్నారు. సెప్టెంబరు ఒకటవ తేదీన వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 2011 కు ముందు అపాయింట్ అయిన ఉపాధ్యాయులందరూ ఇప్పుడు టెట్ వ్రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, 25 నుండి 30 సంవత్సరాల సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులకు ఈ పరీక్ష ఒక గుదిబండగా మారిందన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు ఉపాధ్యాయ సంఘాలు మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ను దాఖలు చేశాయన్నారు. టెట్ పరీక్ష ను ఎన్.సీ.టీ.ఈ నోటిఫికేషన్ 23 ఆగస్టు 2010 న మొదటిసారిగా జారీ చేసిందని, అప్పటి నుండి ఉపాధ్యాయ నియామకానికి ఇది ఒక అర్హతగా మారిందని అయితే 2010 కంటే ముందు అపాయింట్ అయిన ఉపాధ్యాయులందరినీ “ప్రీ నోటిఫికేషన్ కేటగిరి” గా పరిగణించి టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. అవసరాన్ని బట్టి విద్యా హక్కు చట్టానికి సవరణ సైతం పార్లమెంటులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదించి ఆమోదింప చేసి ఉపాధ్యాయులకు మేలు చేయాలన్నారు.

# డా. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం 39 వ వ్యవస్థాపక దినోత్సవం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 39 వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను నవంబర్ 01, శనివారం ఉదయం 11 గంటలకు యూనివర్శిటీ క్యాంపస్ లోని ఆలోచనా హాల్ లో నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ ఉప కులపతి డా. పీ. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిధిగా వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరవ్ గౌర్ హాజరవుతున్నారన్నారు. గౌరవ అతిధులుగా ఉన్నత విద్యా శాఖ చైర్మన్ కే. మధుమూర్తి, ఆయుష్ శాఖ సంచాలకులు దినేష్ కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. జి. రఘునందన్ లు హాజరు అవుతన్నారని యూనివర్శిటీ ఉప కులపతి డా. పి. చంద్రశేఖర్ ప్రకటనలో తెలియజేశారు.

# పునరావాస చర్యలను పర్యవేక్షించిన మంత్రి అచ్చెన్నాయుడు

○ పల్లెపాలెం గ్రామంలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులకు దుప్పట్లు, మందులు పంపిణీ



**కోనసీమ,(జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పునరావాస చర్యలను పరిశీలించడానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన మరియు మార్కెటింగ్ శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఈ రోజు కోనసీమ జిల్లాలోని అంతర్వేది మండలంలోని పల్లెపాలెం గ్రామాన్ని సందర్శించారు. తుఫాన్ సమయంలో గాలివానలు, అధిక వర్షాల ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందని మంత్రి తెలిపారు. పల్లెపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ ఉన్న బాధితులతో మాట్లాడి వారి అవసరాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బాధితులకు దుప్పట్లు, మందులు, అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. తరువాత మంత్రి అచ్చెన్నాయుడు గారు గోదావరి నది సముద్ర సంగమ స్థలమైన అంతర్వేది వద్ద తుఫాన్ ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. గోదావరి ప్రవాహం మరియు సముద్ర అలల పరిస్థితిని తెలుసుకుంటూ, స్థానిక మత్స్యకార కుటుంబాలతో మాట్లాడి వారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత. ఎటువంటి పరిస్థితుల్లోనూ బాధితులు నిరాశ చెందకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# క్షణం తీరకలేకున్నా... మంగళగిరిపై ప్రత్యేక దృష్టి

○ ఎప్పటికప్పుడు అధికారయంత్రాంగానికి సూచనలు

○ పునరావాస కేంద్రాల్లో ఇబ్బందుల్లేకుండా చర్యలు

○ మొంథా తుఫాన్ ప్రభావం.. సత్వరమే పునరుద్ధరణ పనులు

○ మంత్రి నారా లోకేష్ కార్యదక్షతకు నిదర్శనం



**ఉమ్మడి గుంటూరు జిల్లా.బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ గత మూడు రోజులుగా మొంథా తుఫాన్ తీవ్రతపై సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సహచర మంత్రులతో కలిసి నిరంతర పర్యవేక్షణ చేశారు.

క్షణం తీరిక లేకపోయినా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఓవైపు రాష్ట్రవ్యాప్తంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం చేపడుతున్న సహాయక చర్యలపై సమీక్షిస్తూనే, మరోవైపు మంగళగిరి నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలపై నగరపాలకసంస్థ, రెవెన్యూ, పోలీసు శాఖలకు తగు సూచనలు, సలహాలు అందించారు.

**గత పరిస్థితుల దృష్ట్యా....**

మంగళగిరి నియోజకవర్గంలో గత పరిస్థితులను దృష్ట్యా మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల గుర్తింపు, పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనావేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఇంతకుముందే ఎంటీఎంసీ పరిధిలో ‘స్వచ్ఛ మంగళగిరి’ పేరిట డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు చర్యలు పెద్దయెత్తున చేపట్టడం సత్ఫలితాలనిచ్చింది.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటుచేయించారు.

నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను తరలించేందుకు 24 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. కొండప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు మొదలు వారికెటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులు, తాగునీరు, ఆహారం, వైద్యసహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఎంటీఎంసీ అధికారులు గత రెండు రోజులుగా నగరపాలకసంస్థ పరిధిలో ప్రధాన అవుట్ ఫాల్ మేజర్ డ్రైన్ లలో పూడికతీత పనులు చేపట్టారు.

ఎన్నారై వద్ద, కాజ టోల్ ప్లాజా వద్ద గత అనుభవాల దృష్ట్యా పూడికలు తీయంచడం, యర్రబాలెం టబాకో కంపెనీ, రైస్ మిల్ రోడ్ లో కచ్చా డ్రైన్ ల ఏర్పాటు, సుందరయ్యనగర్ లో జంగిల్ క్లియరెన్స్, నవులూరు మారుతీనగర్, ఎంఎస్ఎస్ కాలనీ, మక్కెవారిపేట, ఎంపీఐ కార్యాలయం వద్ద నిల్వ ఉన్న నీటిని ఆయిల్ ఇంజిన్ తో మళ్లింపు, కచ్చా డ్రైన్ ల ఏర్పాటు, నిడమర్రు శివాలయం వద్ద కచ్చా డ్రైన్, ఇప్పటం రోడ్ వడ్డెరపాలెంలో పూడిక తీయించడంతోపాటు పలు చోట్ల కచ్చా డ్రైన్ లు ఏర్పాటు చేశారు. అలాగే, ఆత్మకూరు శ్రీశైల నగర్ లో నిల్వవున్న నీటిని ఆయిల్ ఇంజిన్ తో మళ్ళించారు. వడ్డేశ్వరం టవర్ రోడ్ తోపాటు పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పూడిక తీయించారు. కచ్చా డ్రైన్ లు ఏర్పాటుచేశారు. తాడేపల్లి ప్రభునగర్, తెల్ల క్వారీ ఏరియా, ట్యాంక్ రోడ్, చైతన్య తపోవన్ వద్ద, మహానాడు, గాంధీనగర్, ఎమ్మెల రామయ్య కాలనీ, శివదుర్గాపురం, బాపనయ్య పేట, డోలాస్ నగర్ వంటి పలు ప్రాంతాల్లో ఆయిల్ ఇంజన్ ల ఏర్పాటుచేశారు. నులకపేట చెరువు పొర్లకుండా కచ్చా డ్రైన్ చేపట్టారు. మంగళగిరి యాదవ-పాలెం, బ్యాంకు కాలనీ లలో నీరు నిల్వవుండకుండా ఆయిల్ ఇంజన్తో మళ్ళించారు. టిడ్కోలో మాన్ హోల్స్ క్లీనింగ్, రత్నాలచెరువులో పెద్దయెత్తున పూడిక తీతలు, కచ్చా డ్రైన్ లు సిద్ధం చేశారు. చినకాకాని దీన్ దయాళ్ నగర్ లో పూడిక తొలగింపు పనులు వెంటనే చేపట్టారు.

మంగళగిరి నియోజకవర్గంలో తుఫాన్ పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి, సమస్యాత్మక ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కలిగించి వారిని కేంద్రాలకు తరలించి అన్నివసతులు కల్పించారు.

**జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ లతోపాటు వ్యవసాయ, జలవనరుల శాఖల జిల్లా అధికారులు పర్యటనలు జరిపి పునరావాసకేంద్రాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు చర్యలు చేపట్టారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా రక్షిత మంచినీటి సరఫరా కేంద్రాల వద్ద జనరేటర్ లను సిద్ధంగా ఉంచారు. మంచి నీటి ట్యాంకర్లు, గల్పర్ లు, పలుచోట్ల జేసీబీలను అందుబాటులో వుంచారు. పునరావాస కేంద్రాల్లోనూ కరెంటు ఇబ్బందుల్లేకుండా గత రాత్రి జనరేటర్ లు ఏర్పాటు చేయించారు. క్షేత్రస్థాయిలో కూటమి నాయకులు సహాయక చర్యలు చేపట్టేలా దిశానిర్దేశం చేశారు.

**సత్వరమే పునరుద్ధరణ చర్యలు**

మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కూలిపోయిన చెట్లను సత్వరమే తొలగింపు చర్యలు చేపట్టడంతోపాటు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేశారు. మంగళగిరి ఇందిరానగర్, ఎల్బీ నగర్, కొత్త పేట భవానీ హాస్పిటల్ రోడ్, ఎన్నారై రోడ్, రత్నాలచెరువు, నాంచారమ్మ చెరువు వద్ద, అలాగే, తాడేపల్లి... సీతానగరం, ముగ్గురోడ్డు, కేఎల్ రావు కాలనీ, మహానాడు ప్రాంతాలు, మంగళగిరి రూరల్ నిడమర్రు-కంతేరు రోడ్ లలో నేలకొరిగిన చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగింపు చర్యలు చేపట్టారు. ఎక్కడా కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. దుగ్గిరాల మండలంలోని ప్రతి గ్రామంలో ముంపు సమస్యలు లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే, పంట పొలాలు వరద ముంపునకు గురికాకుండా సాధ్యమైనంతమేర నీటి మళ్ళింపు చర్యలు తీసుకున్నారు.

గతంలో విశాఖపట్నంలో హుద్ హుద్ తుఫాన్ వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దగ్గరుండి అధికార యంత్రాంగం సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించేలా పర్యవేక్షణ జరిపారు. అదేవిధంగా నేడు మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వుండి నిరంతరం పర్యవేక్షణ చేయడంతోపాటు మంగళగిరి నియోజకవర్గంలో అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసి తండ్రికి తగ్గ తనయుడిగా నిలిచారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467